
RNI NO. TELTEL/2021/81092
Published from Jagtial
Email: prajamantalu@gmail.com



# ప్రజా మంటలు
తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8
సంచిక (Issue) : 186 వెల - రూ 5:00
ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు
prajamantalu.com

ఆదివారం 6, నవంబర్ 2022



ఎమ్మెల్యేల కొనుగోళ్లలో సిద్ధహస్తుడు 4లో



సప్త ఖండాల మహిళా పృచ్ఛకులతో అవధానం 5లో

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,

# విజేత ఎవరో..!

- నేడు తేలనున్న మునుగోడు విజేత
- ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్
- మధ్యాహ్నం 1గంట కల్లా ఫలితం వెల్లడి
- భారీగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం
- పోలీస్ బందోబస్తు, సిసి కెమెరాల పహారాలో ఓట్ల లెక్కింపు
- 15 రౌండ్లలో లెక్కింపు పూర్తి
- కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత




**నల్లగొండ,నవంబరు 5(ప్రజామంటలు):** మునుగోడు విజేత ఎవరో నేడు తేలిపోనుంది. తొడగొట్టిన బిజెపి అభ్యర్థి రాజగోపాల్ రెడ్డియా లేక అధికార టిఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డియా లేక కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతియా అన్నది తేలనుంది. ఈ ముగ్గురిలో విజయం ఎవరిని వరించనుందో అని ప్రజలతో పాటు రాజకీయ పార్టీలు కూడా లెక్కలు వేస్తున్నాయి. మునుగోడు నియోజకవర్గ ఉప ఎన్నికలో ఓట్ల లెక్కింపు ఆదివారం ఉదయం మొదలవ్వనుంది. 3న పోలింగ్ ముగిసిన వెంటనే నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి ఈవీఎంలను నల్లగొండలోని ఎఫ్‌సీఐ గోదాములోకి తరలించి భద్రపరిచారు. స్ట్రాంగ్ రూం వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రెండు నెలల హోరాహోరీ ప్రచారం, పోలింగ్ రోజు సాయంత్రం ఎగ్జిట్‌పోల్స్.. విజయంపై ఎవరి ధీమా వారిలో ఉంది. ఎగ్జిట్‌పోల్స్ తమకు అనుకూలంగా ఉన్నాయని, విజయం తమదేనని గులాబీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తుండగా.. ఎగ్జిట్‌పోల్స్ అన్నివేళలా నిజం కాలేదని, మధ్యాహ్నం తర్వాత యువత పెద్దసంఖ్యలో పోలింగ్‌లో పాల్గొన్నారని, వృద్ధులు కారు గుర్తుకు వేయలేకపోయారని, ఇలాంటి కారణాలెన్నో తమ విజయానికి దోహదం చేస్తాయని కమలనాథులు చెబుతున్నారు. ఎవరికి వారు ధీమాగా ఉన్నా.. అభ్యర్థుల భవితవ్యం మాత్రం ఈవీఎంల్లో నిక్షిప్తమై ఉంది. 6న ఉదయం బాక్సులు తెరిచాక ఎవరి భవితవ్యం ఏంటో తెలియనుంది. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపునకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు లెక్కింపు మొదలవుతుంది. తొలుత 686 పోస్టల్ బ్యాలెట్లను లెక్కించిన తర్వాత ఈవీఎంలను తెరుస్తారు. 15 రౌండ్లలో కౌంటింగ్‌ను పూర్తి చేయనున్నారు. ఒక్కో రౌండ్‌లో 21 పోలింగ్ స్టేషన్లలో నమోదైన ఓట్లను లెక్కించనున్నారు. ఏజెంట్లు, సిబ్బందిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత, ఈసీ ఇచ్చిన గుర్తింపు కార్డులను చూపితేనే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తారు. పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థుల సమక్షంలో స్టాంరగ్ రూంలను ఓపెన్ చేసి పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. తొలి రౌండ్ ఫలితం ఉదయం 9 గంటలకు వెల్లడయ్యే అవకాశం ఉంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఆర్వో రోహిత్‌సింగ్‌తో పాటు ఢిల్లీ నుంచి వచ్చిన ముగ్గురు పరిశీలకుల పర్యవేక్షణలో ఈ కౌంటింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. ఇకపోతే మునుగోడు ఫలితంపై జోరుగా బెట్టింగులు నడుస్తున్నాయి. పోలింగ్ రోజు చివరి మూడు గంటల్లో 20 శాతం ఓట్లు పోలవడంతో గెలుపోటములను అవే డిసైడ్ చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో చివరి మూడు గంటల పోలింగ్ పైనే పెద్ద ఎత్తున బెట్టింగ్ సాగుతోంది. టీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల గెలుపుపై వేల నుంచి లక్షల్లో పందాలు కాస్తున్నారు. ఇందుకోసం బుకీలు మిగతా... 2లో

## మునుగోడు ఉప ఎన్నికకు ఏర్పాట్లు

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

**హైదరాబాద్,నవంబర్5(ప్రజామంటలు):** మునుగోడు నియోజకవర్గ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. నల్లగొండ అర్జాలభావిలో తెలంగాణ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోడన్స్‌లో ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభించ నున్నట్లు తెలిపారు. ఉదయం 7.30 గంటలకు ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌ల మిగతా... 2లో





## మరమ్మతులలో అక్రమాలు

- మోర్బీలో తీగల వంతెన కూలిన ఘటన
- మున్సిపల్ విభాగం చీఫ్ ఆఫీసర్‌పై వేటు
- మరమ్మత్తులకు 2 కోట్లు కేటాయిస్తే 12 లక్షలు మాత్రమే ఖర్చు
- ఒక్కొక్కటిగా బయటపడుతున్న అక్రమాలు

**గాంధీనగర్,నవంబరు 5(ప్రజామంటలు):** గుజరాత్‌లోని మోర్బీలో తీగల వంతెన కూలిన ఘటనలో తొలిసారి ఓ ప్రభుత్వ అధికారిపై వేటు పడింది. మోర్బీ మున్సిపల్ విభాగం చీఫ్ ఆఫీసర్(సీవో)ను గుజరాత్ మిగతా... 2లో



## హిమాచల్ ఎన్నికల ప్రచారంలో ప్రియాంక బిజీ

- రాహుల్ యాత్రలో పాల్గొనకపోవడంపై కేంద్రమంత్రి విమర్శలు
- అన్నా చెల్లెళ్ల మధ్య గ్యాప్ ఏర్పడిందన్న అనురాగ్ ఠాకూర్

**న్యూఢిల్లీ,నవంబర్5(ప్రజామంటలు)** :రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర తెలంగాణలో 10వ రోజు కొనసాగుతోంది. సంగారెడ్డి జిల్లా చౌటకుర్ మండలం సుల్తాన్ పూర్ నుంచి రాహుల్ శనివారం ఉదయం తన యాత్రను ప్రారంభించారు. గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల మిగతా... 2లో




## ఆప్ అధినేతను ఉచ్చులో బిగించిన బిజేపి

### కేజ్రీవాల్‌కు ధర్మసంకటంగా మారిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు

**న్యూఢిల్లీ నవంబర్ 05 (ప్రజా మంటలు బ్యూరో):** న్యూఢిల్లీ మున్సిపల్ ఎన్నికలను డిసెంబర్ 5వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. గత మూడేళ్లుగా వాయిదా పడుతూ వచ్చిన ఢిల్లీ కార్పొరేషన్ ఎన్నికలను అకస్మాత్‌గా నిన్న ప్రకటించారు. మూడుకార్పొరేషన్లుగా ఉన్న ఢిల్లీ నగరాన్ని ఒకే కార్పొరేషన్‌గా మార్చడానికే ఇన్నాళ్ళు ఆలస్యం చేశామన్నా కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు ఢిల్లీ ముఖ్యమంత్రిని ఢిల్లీ కే కట్టడి చేయడానికి గాను ఢిల్లీ కార్పొరేషన్ ఎన్నికలు ప్రకటించారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. గుజరాత్ ఎన్నికల్లో సామాన్యుడైన జర్నలిస్ట్ ను ఆమ్ ఆద్మీ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎంపిక చేయడం, ఓబీసీ వర్గాలలోనే కాకుండా మేధావి వర్గాలలో కూడా ఆయనకు గుర్తింపు ఉండడం పార్టీకి కలిసి వస్తుందని అనుకొంటున్నారు. 40 యేళ్ళ యువ మిగతా... 2లో

## తెలంగాణ కాంగ్రెస్‌కు దిశానిర్దేశం

- రాహుల్ భారత్ జోడోయాత్రకు విశేష స్పందన
- అన్ని వర్గాల సమస్యలు తెలుసుకుంటున్న రాహుల్
- మీడియాతో సీనియర్ నేత జైరామ్ రమేశ్



**సంగారెడ్డి,నవంబరు 5(ప్రజామంటలు):** రాష్ట్రంలోని అన్ని వర్గాల నుంచి రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో యాత్ర'కు విశేష స్పందన వస్తోందని, ఇది కాంగ్రెస్ పార్టీలో కొత్త జోష్‌ను తీసుకొచ్చిందని కాంగ్రెస్ సీనియర్ మిగతా... 2లో



## శ్రీవారి ఆస్తులపై టీటీడీ శ్వేతపత్రం

- జాతీయ బ్యాంకుల్లో రూ. 15,938 కోట్లు డిపాజిట్లు
- టిటిడి ఇవో ధర్మారెడ్డి వెల్లడి

**తిరుమల,నవంబర్5(ప్రజామంటలు):** శ్రీవారి ఆస్తులపై టీటీడీ శ్వేతపత్రం విడుదల చేసింది. మొత్తం వివిధ జాతీయ బ్యాంకుల్లో రూ. 15,938 కోట్లు డిపాజిట్లు ఉన్నాయని వెల్లడించింది. 10,258.37 కిలోల బంగారం బ్యాంకుల్లో నిల్వ ఉందని తెలియజేసింది. శనివారం డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఓ భక్తుడు అడిగిన ప్రశ్నకు ఈవో ధర్మారెడ్డి వివరాలు ప్రకటించారు. మెచ్యూరిటీ పూర్తయిన డిపాజిట్లను అధిక వడ్డీ ఇచ్చే బ్యాంకుల్లో డిపాజిట్లు పెట్టామని తెలియజేసింది. కాగా గడిచిన మూడేళ్లలో స్వామివారి నగదు డిపాజిట్లు భారీగా పెరిగాయి. మిగతా... 2లో

## పటిష్టంగా పోక్సో చట్టం అమలు

- ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్వల్ భూయాన్



**హైదరాబాద్,నవంబర్5(ప్రజామంటలు):** పోక్సో చట్టాన్నీ పటిష్టంగా అమలు చేయడానికి ప్రభుత్వంలోని వివిధ శాఖలు, న్యాయవ్యవస్థ సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్వల్ భూయాన్ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ జ్యూడిషియల్ అకాడమీ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై సంబంధిత శాఖలు, న్యాయాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ఏర్పాటు చేసిన సదస్సును ఆయన ప్రారంభించారు. సదస్సుకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్, జస్టిస్ వినోద్ కుమార్, జస్టిస్ అభిషేక్ రెడ్డి, జస్టిస్ రాధారాణి, జస్టిస్ నందా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన మిగతా... 2లో

## ప్రజానాడి




## ఓడినా - గెలిచినా ప్రజాసేవలోనే ఉంటా

- నేను మంచోడినే కానీ బలహీనుణ్ణి కాదు
- రాజకీయాల్లోకి సేవ చేయడానికి వచ్చాను
- వైరాగ్యంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్




**జగిత్యాల నవంబర్ 05 (ప్రజా మంటలు):** ఓడినా- గెలిచిన ప్రజాసేవలోనే ఉంటాను, రాజకీయాల్లోకి వచ్చింది సేవ చేయడానికి మాత్రమే కానీ మరేదో ఆశించికాదని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. చలిగల్ మార్కెట్ యార్డులో మాట్లాడుతూ ఒకప్పుడు అంతర్గామా చెరువు కింద నాకు 50 ఎకరాల భూమి ఉండేడి. ప్రస్తుతం ఐదు ఎకరాలు కూడా లేదని, రైస్ మిల్లర్లతో రాజీ పడి, కుమ్మక్కయె వ్యక్తిని కాదని, తాను రైతుల కోసం నిరంతరం కృషి చేస్తున్నానని అన్నారు. ఇటీవలి కాలంలో ఆయనపై కొందరు చేస్తున్న విమర్శలను దృష్టిలో పెట్టుకొని, మనస్తాపంతో, ఆవేదనతో కూడిన స్వరంతో ఎమ్మెల్యే ఈ మాటలు అన్నట్లుగా భావిస్తున్నారు. జగిత్యాల రాజకీయ చదరంగంలో బలమైన వ్యతిరేక వర్గం లేని ఎమ్మెల్యే ఇంత నిరాశగా మాట్లాడడానికి మిగతా... 2లో

## అధికంగా ఇంజనీరింగ్ ఫీజుల వసూళ్లు

- ఫీ రెగ్యులరేటటీ కమిటీ ఆగ్రహం

**హైదరాబాద్,నవంబరు 5(ప్రజామంటలు):** ప్రైవేటు ఇంజనీరింగ్, మేనేజ్ మెంట్ కాలేజీలు అధిక ఫీజులను వసూలు చేయడంపై తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము నిర్ణయించిన ఫీజులు మాత్రమే కాలేజీలు తీసుకోవాలని సూచించింది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ జెన్‌డియూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, మిగతా... 2లో






## వైసీపీ గూండాలను ధైర్యంగా ఎదుర్కోవాలి

- వైసిపికి వారి భాషలోనే సమాధానం చెబుతాం
- ఇప్పటం గ్రామస్థులకు అండగా నిలుస్తాం
- న్యాయపరంగా వారికి తోడుంటాం
- ఇళ్లు కూల్చివేతపై ఆగ్రహించిన జనసేనాని
- ఇప్పటం బాధితులను పరామర్శించిన పవన్ కళ్యాణ్
- ఇప్పటం వెళ్లకుండా పవన్‌ను అడ్డుకున్న పోలీసులు

**అమరావతి,నవంబర్5(ప్రజామంటలు):** వైసీపీ గూండాలను ధైర్యంగా ఎదుర్కోవాలని జనసేన మిగతా... 2లో



## మునుగోడు ఉప ఎన్నికకు ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి అబ్జర్వర్, అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో తీసుకురానున్నట్లు తెలిపారు. కౌంటింగ్‌కు మూడంచెల భద్రతను కల్పించామని, కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసులతో పటిష్ఠ భద్రత కల్పించినట్లు చెప్పారు. 21 టేబుళ్లపై 15 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ర్యాండమ్‌గా ఐదు వీవీప్యాట్లలోని స్లిప్స్‌ను లెక్కించనున్నట్లు తెలిపారు. రౌండ్ల వారీగా ఫలితాలను స్క్రీన్లపై ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 3న మునుగోడు నియోజకవర్గానికి ఎన్నికలు జరగ్గా.. 298 పోలింగ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 2,25,192 ఓట్లు పోలయ్యాయని, 93.13 పోలింగ్ శాతం నమోదైందని వికాస్ రాజ్ తెలిపారు. మరో 680 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారని వివరించారు.

## విజేత ఎవరో..!

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేకంగా ఏజెంట్లను నియమించుకున్నారు. ఐపీఎల్ తరహాలో వారిని రంగంలోకి దించి బెట్టింగులను ప్రోత్సహిస్తున్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ వైపే మెగ్గు ఉందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. అయితే సాయంత్రం 5 గంటల వరకు ట్రెండ్ ఒకలా ఉంటే ... ఆ తర్వాత అసలు కథ మొదలైనట్లు చెబుతున్నారు. సాయంత్రం వరకు గెలుపు ధీమాలో ఉన్న అధికార పార్టీ చివరి మూడు గంట్లో నమోదైన పోలింగ్ ఎవరికి లాభిస్తుందని లెక్కలేస్తోంది.

## పటిష్టంగా పోక్సో చట్టం అమలు

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి సోమేశ్ కుమార్, డిజిపి మహేందర్ రెడ్డితో పాటు పలువురు సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్వల్ భూయాన్ కీలకోపన్యాసం చేశారు. పోక్సో చట్టాన్ని మరింత కఠినంగా అమలు చేయడం ద్వారా మహిళలు, పిల్లలకు భద్రతా ఏర్పడుతుందని స్పష్టం చేశారు. సిఎస్ సోమేశ్ కుమార్ మాట్లాడుతూ పొక్సో చట్టం అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలోని ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉందని పేర్కొన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. చట్టం అమలు పట్ల ప్రభుత్వం కృషిని పలువురు న్యాయమూర్తులు ప్రశంసించారని ఆయన అన్నారు. పోలీస్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల నేతృత్వంలో ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను ఆయన వివరించారు. ప్రభుత్వం ఇటీవలనే ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు చేసి 40 మంది పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించిందని గుర్తుచేశారు. పొక్సో చట్టం పట్ల అవగాహనా పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. డిజిపి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, మహిళలు, పిల్లల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. పోలీస్ విభాగంలో ప్రత్యేకంగా అడిషనల్ డిజి నేతృత్వంలో మహిళా భద్రతా విభాగాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రత్యేకంగా షీ- టీమ్‌లు, భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. బాధిత కుటుంబాలకు, పిల్లలకు సత్వర న్యాయం జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సదస్సులో అడిషనల్ డిజి స్వాతిలక్రా, మహిళా శిశు సంక్షేమ కార్యదర్శి దివ్య, న్యాయశాఖ కార్యదర్శి నర్సింగ్ రావు, జ్యూడిషియల్ అకాడమీ డైరెక్టర్ తిరుమలాదేవి, సుజన. అధికారులు పాల్గొన్నారు.

## అధికంగా ఇంజనీరింగ్ ఫీజుల వసూళ్లు


(మొదటి పేజీ తరువాయి)

ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ లతో కమిటీ ఛైర్మన్ సమావేశమయ్యారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్యా మండలికి కమిటీ సూచించింది. ఇప్పటికే అన్ని కాలేజీల్లో అడ్మిషన్ల పక్రియ దాదాపు పూర్తి కావచ్చిందని వెల్లడించింది. బీ కేటగిరి సీట్ల సంబంధించి కమిటీకి ఫిర్యాదు చేసిన విద్యార్థుల దరఖాస్తులు ఆయా కాలేజీలు స్వీకరించడం లేదని పేర్కొంది. వెంటనే విద్యార్థుల నుంచి బీ కేటగిరీ సీట్ల కోసం దరఖాస్తులు తీసుకోవాలని.. లేకపోతే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఫీజుల పెంపుపై సాధారణంగా మూడేళ్లకు ఒకసారి కమిటీ సమావేశం నిర్వహిస్తుంటుంది. ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారంటూ.. విద్యార్థి సంఘ నాయకులు ఎంఈఖీఅకి వీడియోల ద్వారా ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజులు పెంచిందనే విషయాన్ని విద్యార్థులు గుర్తు చేస్తున్నారు. సమావేశాలు నిర్వహిస్తూ కాలయాపనకే పరిమితమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే తాము ఫీజులు చెల్లించిన అనంతరం సమావేశాలు నిర్వహిస్తే ఏం లాభమని ప్రశ్నిస్తున్నారు. సమావేశం అనంతరం అధిక ఫీజులు వసూలు చేస్తున్న కాలేజీలకు అధికారులు వెళుతారా అధిక ఫీజులు వసూలు చేసిన కాలేజీలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది వేచిచూడాలి.

## శ్రీవారి ఆస్తులపై టీటీడీ శ్వేతపత్రం

(మొదటి పేజీ తరువాయి)

2019 జూన్ నాటికి రూ. 13,025 కోట్లు ఉండగా ప్రస్తుతం రూ. 15,938 కోట్లకి డిపాజిట్లు చేరుకున్నాయి. 2019 నాటికి 7,339.74 కేజీలు ఉండగా ప్రస్తుతం 10.258.37 కేజీల



బంగారం నిల్వలు ఉన్నాయని స్పష్టం చేసింది. టీటీడీ డిపాజిట్లను కేంద్ర, రాష్ట్రప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెడుతుందన్న ప్రచారం అవాస్తవమని ఈవో కొట్టి పారేశారు. స్వామివారి నగదు, బంగారం నిల్వలు ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడులు ఎప్పుడూ పెట్టదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలను నమ్మవద్దని కోరారు.



## తెలంగాణ కాంగ్రెస్‌కు దిశానిర్దేశం

(మొదటి పేజీ తరువాయి)

నేత జైరాం రమేష్ చెప్పారు. ఇప్పటి వరకు తెలంగాణలోని ఏడు జిల్లాల్లో పాదయాత్ర పూర్తయిందని తెలిపారు. ఉన్నతమైన లక్ష్యం కోసం రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర మొదలుపెట్టారని చెప్పారు. ఈ యాత్ర ఎన్నికల కోసం మాత్రం కాదన్నారు. రాహుల్ పాదయాత్ర తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కు కొత్త దిశా నిర్దేశర చేస్తుందని తెలిపారు. పాదయాత్రలో భాగంగా రాహుల్ గాంధీ అన్ని వర్గాల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారని చెప్పారు. పాదయాత్ర సందర్భంగా ఇప్పటికే వందలాది మంది విద్యార్థులు, కార్మికులు, సామాజిక వేత్తలను కలిశారని చెప్పారు. టీఆర్ఎస్ ప్రభుత్వం పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రాహుల్ పాదయాత్ర ద్వారా తమకు తెలిసిందన్నారు. అందోల్ మండలం దానంపల్లి వద్ద జైరాం రమేష్ మాట్లాడారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో త్వరలో జరగబోయే ఉప ఎన్నికలకు భారత్ జోడో యాత్రకు ఎలాంటి సంబంధం లేదని జైరాం రమేష్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఇస్తే పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసి కూడా కాంగ్రెస్ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసిందని, ఇది అత్యంత కఠిన నిర్ణయమని చెప్పారు. పరిపాలన విషయంలో కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ కు ఎలాంటి తేడా లేదని జైరాం రమేష్ ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే పట్టాలపై వెళ్లే డబుల్ ఇంజన్ ప్రభుత్వాలన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో గెలిచేందుకు బీజేపీ, టీఆర్ఎస్ నాయకులు ఎలాంటి ఆపరేషన్లు నిర్వహించారో అందరికీ తెలుసన్నారు.

## మరమ్మతులలో అక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం సస్పెండ్ చేసింది. వివరాల్లోకి వెళితే.. మోర్బీ మున్సిపాలిటీ.. ఒరెవా సంస్థకు 15ఏళ్లపాటు ఈ వంతెన మరమ్మతులు, నిర్వహణ కాంట్రాక్టును ఇచ్చినట్లు అధికారులు ఇప్పటికే వెల్లడించారు. అయితే.. ఈ కేబుల్ వంతెనను పున:ప్రారంభించే ముందు అధికారులకు సమాచారం అందించలేదని జాలా చెప్పారు. బ్రిటిష్ కాలం నాటి ఈ వంతెనకు మరమ్మతులు నిర్వహించిన తర్వాత సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకోకుండానే తిరిగి తెరిచినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. మోర్బీ మున్సిపాలిటీ ముఖ్య అధికారి సందీప్‌సిన్హ్ జాలాను రాష్ట్ర పట్టణాభివఅద్ధి శాఖ సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ జీటీ పాండ్య వెల్లడించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు రెసిడెంట్ అదనపు కలెక్టర్‌కు చీఫ్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. అంతకుముందు గురువారం ఈ ఘటనపై పోలీసులు జాలాను నాలుగు గంటలకుపైగా విచారించారు. గుజరాత్‌లోని మోర్బీ నగరంలో మచ్చు నదిపై తీగల వంతెన కూలిన దుర్ఘటనలో ఇప్పటివరకు 135 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఘటనాస్థలాన్ని సందర్శించిన ప్రధాని నరేంద్ర మోడీ.. ఈ ప్రమాదంపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలని ఇప్పటికే ఆదేశించారు. మరోవైపు.. పోలీసులు ఈ ఘటనలో ఇప్పటివరకు తొమ్మిది మందిని అరెస్టు చేశారు.

గుజరాత్ మోర్బీలో కేబుల్ బ్రిడ్జి కూలిన ఘటనపై పోలీసుల విచారణలో కీలక విషయాలు బయట పడుతున్నాయి. బ్రిడ్జి మరమ్మతులు, నిర్వహణ కాంట్రాక్టును 15 ఏళ్ల కాలానికి తీసుకున్న ఒరేవా గ్రూప్.. వేరే సంస్థకు సబ్ కాంట్రాక్టు ఇచ్చినట్టు తెలుస్తోంది. కేబుల్ బ్రిడ్జి మరమ్మతులకు 2 కోట్లు కేటాయిస్తే.. కాంట్రాక్ట్ సంస్థ కేవలం 12 లక్షలు మాత్రమే ఖర్చు చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. కేబుల్ బ్రిడ్జి మరమ్మతులకు కాంట్రాక్ట్ తీసుకున్న ఒరెవా సంస్థ గడియారాలు తయారు చేస్తుంది. ఈ సంస్థకు మౌలిక సదుపాయాల కల్పనలో నైపుణ్యం, అనుభవం లేదు. అందుకే ధ్రగాంధ్రకు చెందిన దేవ్ ప్రకాశ్ సొల్యూషన్?కు సబ్ కాంట్రాక్ట్ ఇచ్చినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. అయితే ఈ సంస్థకు కూడా కేబుల్ బ్రిడ్జి మరమ్మతులు, నిర్వహణ చేసే సాంకేతిక పరిజ్ఞానం లేదని దర్యాప్తు అధికారులు గుర్తించారు. దేవ్ ప్రకాశ్ సొల్యూషన్ నుంచి కీలక డాక్యుమెంట్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## వైసీపీ గూండాలను ధైర్యంగా ఎదుర్కోవాలి

(మొదటి పేజీ తరువాయి)

అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు చేసే పోరాటంలో దేనికైనా సిద్ధమేనని పవన్ కళ్యాణ్ అన్నారు.

గుంతలు పూడ్చలేరు.. రోడ్లు వేయలేరు.. గానీ విస్తరణ కావాలా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళగిరి



నియోజకవర్గంలోని ఇప్పటం అనే చిన్న గ్రామంలో 53 ఇళ్లు, ప్రహరీలు కూల్చివేసిన నేపథ్యంలో ఆయన పర్యటన చేశారు. ఈ సందర్భంగా అక్కడ కూల్చేసిన ఇళ్లను పరిశీలించిన ఆయన బాధితులను పరామర్శించి సంఘీభావం తెలిపారు. అక్కడే కొంత మంది బాధితులతో మాట్లాడి, కూల్చివేతల విషయంలో చోటుచేసుకున్న పరిణామాలను తెలుసుకున్నారు. ఇప్పటంలో ఇళ్లు కూల్చడానికి ఎవరు ఎదురు మాట్లాడినా వారిపై దౌర్జన్యం చేస్తున్నారని అన్నారు. రేషన్ కార్డులు రద్దు చేస్తున్నారని, ఎంత కాలం ఈ అన్యాయమని ప్రశ్నించారు. ఇక చూస్తూ ఊరుకునేది లేదని, కిరాయి మూకలు తాము భయపడమని అన్నారు. పవన్ పర్యటన దృష్ట్యా అప్పటికే అక్కడ మోహరించిన పోలీసులు పవన్ వెళ్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో ఆయన కాలి నడకన వెళ్లారు. అత్యాచారాలు చేస్తున్న వారిని పోలీసులు వదిలేస్తున్నారని, కూల్చివేస్తున్న వారికి పోలీసులు కొమ్ముకాస్తున్నారని అన్నారు. రోడ్డు విస్తరణ కోసం ఇళ్లు కోల్పోయిన బాధితులను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఏపీలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి కాదు... సజ్జల రామకృష్ణారెడ్డి అని అన్నారు. సజ్జల గారూ.... మీరు ఎన్ని కుట్రలు చేసినా ఎదుర్కోవడానికి నేను సిద్ధం అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా జగన్ రెడ్డి పాలన సాగుతోందని పవన్ మండిపడ్డారు. నాకు మద్దతు ఇస్తే ఇళ్లు పడగొడతారా. ఇక నుంచి మీ దౌర్జన్య కాండపై మా పోరాటం సాగుతుంది. చొక్కా పట్టుకుంటే... చెప్పు తీసుకుని కొట్టండి. వైసీపీ రౌడీల్లారా ఖబడ్దార్.. సమరానికి మేమూ సిద్ధం. ఇక నుంచి పద్ధతిగా రాజకీయం చేస్తే... మేము అలాగే వెళతాం. బూతులు, దాడులు అని తెగ బడితే మాత్రం... తేల్చుకుంటాం అంటూ పవన్ హెచ్చరించారు. రహదారులపై గుంతలను పూడ్చలేని అసమర్థ ప్రభుత్వం వైసీపీ అని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ విమర్శించారు. బస్సు సౌకర్యం లేని గ్రామానికి వంద అడుగుల రోడ్డును వేస్తామంటూ పేద ప్రజల బతుకులతో ఆడుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన పార్టీకి ఇప్పటం గ్రామం అండగా నిలబడిందనే కక్షతో, ఫాక్షన్ కు అలవాటుపడిన సీఎం కావాలని కుట్రతో పేదల ఇళ్లు కూలగొడుతున్నారని ఆరోపించారు. ప్రజల్లో తిరుగుబాటు వస్తే మిమ్మల్ని కాపాడడం ఎవరి తరం కాదని హెచ్చరించారు. ప్రజలకు మీ మీద కోపం కాదని.. ఆగ్రహం వస్తోందన్నారు. మీ చేతలతో ప్రజల ఆగ్రహానికి గురి అయ్యి భస్మం అవుతారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. 15 అడుగుల రోడ్ల విస్తరణకు మీకు మనసు రాలేదుగానీ..70 అడుగుల రోడ్డును 100 అడుగులు చేయడానికి మాత్రం అత్యవసరంగా అభివృద్ధి గుర్తుకు వచ్చిందా అని పవన్ కళ్యాణ్ ప్రశ్నించారు. ఇప్పటం గ్రామం జనసేన పార్టీకి అండగా నిలబడిందని, వారికి కష్టమొస్తే మేము మా ప్రాణాలకు తెగించి అయినా వారిని కాపాడుకుంటామని చెప్పారు. ప్రతికూల పరిస్థితుల్లో జనసేనకు తోడుగా నిలిచే వారిని ఎట్టి పరిస్థితిలో వదులుకోబోమన్నారు. కచ్చితంగా ఇప్పటం గ్రామస్తులకు చివరి వరకు తోడుంటామని, ఎన్ని కేసులు, మరెన్ని నిర్బంధాలు ఎదురైనా ఈ పోరాటం ఆగదన్నారు. కచ్చితంగా ఇప్పటం గ్రామస్థుల తరఫున న్యాయపోరాటం చేస్తామని పవన్ కళ్యాణ్ తెలిపారు. పవన్ కళ్యాణ్ హత్యకు ఎలాన్ చేశారంటూ ఇటీవల ప్రచారం జరిగింది. దీనిపై పవన్ కళ్యాణ్ స్పందిస్తూ ప్రభుత్వం సలహదారు సజ్జల రామకృష్ణా రెడ్డికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తనను ఏదో చేయడానికి రెక్కీలు, సుపారీలు, సున్నాలు, కన్నాలు ఏవేవో ప్లాన్ చేస్తున్నారని, ఎన్ని బెదిరింపులకు దిగినా ప్రజల తరఫున తమ పోరాటం ఆగదని పవన్ కళ్యాణ్ తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కష్టంలో ఉన్న పేదవాడికి జనసేన పార్టీ తోడుగా నిలుస్తుందన్నారు. వైసీపీ నాయకులు ప్రజాస్వామ్య భాషలో మాట్లాడితే జనసైనికులు అలాగే మాట్లాడాలని? కాదు కూడదు అంటే వారి భాషలోనే మాట్లాడాలంటూ పార్టీ శ్రేణులకు సూచించారు. కేసులు, బెదిరింపులు, దౌర్జన్యాలు చేస్తామంటే వాటిని ఎదుర్కోవడానికి మీతో పాటు తాను సిద్ధంగా ఉన్నానని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఎంతకాలం వీరి అరాచకాలకు భయపడితే అంతకాలం వీరి రాక్షసత్వానికి అంతుండదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజ్యం పెట్టే బెదిరింపులకు ఏ మాత్రం లొంగకుండా ఇదే పద్ధతిలో తెగింపుతో ముందుకు వెళ్దామని మీ అందరికి పవన్ కళ్యాణ్ ఉన్నాడని కీలక వ్యాఖ్యలు చేశారు.

## ఆప్ అధినేతను ఉచ్చులో బిగించిన బిజేపి

(మొదటి పేజీ తరువాయి)

జర్నలిస్ట్, ఎలాంటి రాజకీయ జీవితం లేని ఇసుడాన్ గాడ్విని ఎంపిక చేసి రాజకీయయ్పండితులను ఆశ్చర్యపరిచిన కేజ్రీవాల్, యువత, మధ్యతరగతి ప్రజలు తమకే పట్టం కడతారని ఆశిస్తున్నారు.

గుజరాత్‌లో బిజేపికి బలమైన ప్రత్యర్థిగా ఎదుగుతున్న ఆప్ పార్టీని ఢిల్లీ




కె కట్టడి చేయడం ద్వారా గుజరాత్ లో ఆ పార్టీ ప్రభావం శాసన సభ ఎన్నికల్లో అంతగా లేకుండా చూడాలనే ప్రయత్నంలో భాగంగానే ఈ ఎన్నికలను డిసెంబర్ 5వ తేదీన నిర్వహిస్తున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు. కొత్తగా ఏర్పడ్డ ఢిల్లీ కార్పొరేషన్ లో 250 సీత్లుండగా, ఇందులో 50 శాతం అంటే, 125 సీట్లను మహిళలకు కేటాయించారు. మరో 27 సీట్లను ఎస్సీలకు కేటాయించారు.

డిల్లీలో పంజాబీలు కూడా గణనీయంగా ఔన్నారు. పంజాబ్ ముఖ్యమంత్రిని కూడా, ఢిల్లీ దాటి గుజరాత్ రాకుండా ఉంచడానికి కూడా ఈ ఎన్నికలు ఉపయోగపడతాయి. గుజరాత్ ఎన్నికల్లో బిజేపికి ఆప్ పార్టీ అధినేత బలమైన పోటీ ఇస్తాడని ప్రవ్హారామ్ జరుగుతున్నా నేపథ్యంలో ఈ ఎన్నికలు ఆప్ పార్టీకి ఆశానిపాతంలా తగిలిన దెబ్బలా భావిస్తున్నారు.

డిల్లీలో గత మూడు తర్మ్ లుగా అధికారంలో ఉన్న బిజేపి త్రువాట్, ఆప్ పార్టీకి అధిక స్థానాలున్నాయి. మూడవ స్థానంలో కాంగ్రెస్ ఉంది. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం ఆప్ పార్టీదే అయినా, నగరాభివృద్ధిలో కార్పొరేషన్ పాత్ర కూడా గణనీయంగానే ఉంటుంది. అందుకే ఢిల్లీ నగర ప్రభుత్వం కూడా ఆప్ అధికారంలోకి వస్తే, నగరాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని ఆం ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ చెపుతున్నాడు. ఎన్నికలు త్వరగా నిర్వహించాలనే డిమాండ్ కూడా చేశారు. కానీ ఇంత అకస్మాత్ గా ఈ ఎన్నికలు రావడం బిజేపి రాజకీయ వ్యూహంలో భాగంగానే చెప్పుకున్నారు.

ఆం ఆద్మీ పార్టీలో కేజ్రీవాల్ తరువాత ఉన్న ప్రధాన ప్రచార కర్తలు మనిస్ సిసోడియా, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ లు ముఖ్యమైన వారు. ఈపాటికే సిసోడియా పై ఢిల్లీ మధ్యం కుంభకోణం పేర శోధనలు, విచారణలు మొదలయ్యాయి. దీంతో ఎన్నో రోజుల తన గుజరాత్ పర్యటనలను సిసోడియా వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఈ ఎన్నికల వల్ల, దిల్లే కార్పొరేషన్ పీఠాన్ని దక్కించుకోవడానికి ఈ ముగ్గురు తప్పని సరిగా తమ గుజరాత్ పర్యటనలను తగ్గించుకొని, ఇక్కడే ఉండాల్సి వస్తుంది.

గుజరాత్ ఎన్నికలు డిసెంబర్ 1,4వ తేదీలలఓ ఉన్నాయి. ఢిల్లీ ఎన్నికలు డిసెంబర్ 5వ తేదీన ఉన్నాయి. ఢిల్లీ నుండి 34 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుజరాత్ జరిగే ఎన్నికల ప్రచారంలో ఉధృతంగా పాల్గొనకుండా కట్టడి చేయడానికి ఈ అక్స్మాట్ ఎన్నికల సృష్టి అని పరిశీలకు భావిస్తున్నారు, కేజ్రివాల్ గుజరాత్ లో బిజేపి ని ఓడించే స్థాయిలో ఉన్నాడనే భయంతోనే ఢిల్లీ కార్పొరేషన్ ఎన్నికలను ప్రకటించి నట్లుగా ఆమ్ఆద్మీ పార్టీ విమర్శిస్తుంది. రాజకీయాలలో ఎత్తుకు పై ఎత్తులు వేయడం సహజమే. బిజేపి ఇలాంటి వాటిలో దిట్ట అనే విషయం తెల్సినా, ఈ ఎన్నిక్ల ప్రకటనతో బిజేపి పై చేయి సాధించి నామాని అనుకొంటుందని, ప్జలు తమ వైపే ఉన్నారని, ఇప్పటికే దాదాపు రాష్ట్ర మంతా చుట్టి వచ్చిన కేజ్రీవాల్, ఇక ఢిల్లీ ఎన్నికలపినే దృష్టి పెడతాదని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

## ఓడినా - గెలిచినా ప్రజాసేవలోనే ఉంటా

(మొదటి పేజీ తరువాయి)

కారణాలు ఏమిటా అని ప్రజలు, పార్టీ నాయకులు ఆలోచిస్తున్నారు. ఆయన కొన్ని విషయాలలో తొందరపాఊగా వ్యవహరించడం, లౌక్యం లేకపోవడమే కాకుండా, ఎవరి మాట వినకుండా తనకు తోచిందే చేస్తారనే ప్రచారం కూడా ఉంది. ఎదుట్‌బీఈ వారు చెప్పేది వినకుండానే తన వాదన్ వినిపించడం వల్ల పార్టీలోని చాలా మండి ఈయన పట్ల అసంతృప్తితో ఉన్నారనే మాట ఉన్నా, ఆయనకు ప్రత్యర్థులుగా ఎదగలిగే వారు లేరనే ధీమా కూడా ఆయన ఉంది. ఇలాంటి సమయంలో ఈయన వైరాగ్యం జగిత్యాల తెరసలో సంచలనం కలిగిస్తుంది.

ఇంకా, తాను రైతు కుటుంబ నుంచి వచ్చినానని, తాను పశువుల పేడ తియ్యలేదు, కానీ తన కుటుంబ నేపథ్యం రైతు కుటుంబ నేపథ్యం అని గుర్తు చేశారు. బాధ్యతల నుండి పారిపోయే వ్యక్తిని కాదని, ప్రజాసేవలో నిరంతరం శ్రమిస్తానని అన్నారు. ఉన్న పని విడిచిపెట్టుకొని తాను రాజకీయాలకు వచ్చానని, రాజకీయాల్లోకి వచ్చే ముందు తన ఆసుపత్రి పరిస్థితి- రాబడి, ఇప్పటి పరిస్థితి గమనించాలని అన్నారు. అధికారులు తన మాట వినడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినిత్యం పత్రికల్లో చానల్లో అధికారులు తన మాట వింటులేరని ప్రజలు అంటున్నారని ప్రచారం జరుగుందని అన్నారు. ఈ విషయమై కలెక్టర్ ను ప్రత్యేకంగా కలిసి దండం పెట్టి మరి విషయాలను విన్నవించానాని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజా సమస్యల పరిష్కారంలో సహకరించి, త్వరగా పరిష్కరించాలని కోరారు. కచ్చితంగా తనకు మళ్లీవచ్చే ఎన్నికల్లో



పోటీ చేయాలని ఉన్నది. కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తే మనసు బాధగా ఉన్నది. ఇలాంటి అపవాదూ భరిస్తూ ఇంకా రాజకీయాల్లో ఉండడం అవసరమా అని ఓసారి అనిపిస్తోందని ఆవేదన చెందారు. ప్రజలు తనకు గొప్ప అవకాశం ఇచ్చారని, అందరి ఆదరాభిమానంతో గెలిచానని, శక్తి ఉన్నంతవరకు సేవ చేస్తూనే ఉంటానని అన్నారు. ఎవరో కొందరు తనపై బట్ట కాల్చి మీద వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతయుత్తంగా పనిచేస్తున్న తనను మీడియా మిత్రులు కూడా గుర్తించాలని కోరారు. ఎలాంటి ప్రజా ఉపయోగ కార్యక్రమాలైనా, ఉన్నప్పుడు తన ప్రమేయం లేకుండా సర్పంచులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీ చైర్మన్ ప్రారంభోత్స వాలకు వెళ్ళవచ్చని, తాను కూడా వీలైనంత మేర వచ్చే ప్రయత్నం చేస్తానని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల సెంటర్ల ప్రారంభోత్సవానికి తాను లేనని ఆపవలసిన అవసరం లేదని, రైతుల కోసం ఎప్పటికప్పుడు సేవ చేయడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని అన్నారు.

## హిమాచల్ ఎన్నికల ప్రచారంలో ప్రియాంక బిజీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రచారానికి దూరంగా ఉన్న రాహుల్.. యాత్రపైనే ఫోకస్ పెట్టారు. రాహుల్ గాంధీ కర్ణాటకలో యాత్ర చేస్తున్న సమయంలో సోనియా గాంధీ అందులో పాల్గొన్నారు. అయితే ప్రియాంక గాంధీ ఇప్పటి వరకు రాహుల్ గాంధీ యాత్రలో పాల్గొనలేదు. ప్రస్తుతం ఆమె హిమాచల్ ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరఫున విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు.

హిమాచల్ ప్రదేశ్‌లో అధికార బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య అక్కడ హోరాహోరీ పోరు నెలకొంటోంది. నేపథ్యంలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్.. ప్రియాంక గాంధీని టార్గెట్ చేశారు. రాహుల్ యాత్రలో ప్రియాంక గాంధీ పాల్గొనకపోవడంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధి వాద్రాల మధ్య గ్యాప్ వచ్చిందంటూ ఆయన చెప్పుకొచ్చారు. అందుకే ఆమెను భారత్ జోడో యాత్రలో పాల్గొనాలని రాహుల్ గాంధీ ఆహ్వానించలేదని చెప్పుకొచ్చారు.

దేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన వారితో కలిసి రాహుల్ గాంధీ యాత్ర చేస్తున్నారంటూ అనురాగ్ ఠాకూర్ విమర్శించారు.

# తడి చెత్త, పొడి చెత్త వేరు చెయ్యడంపై అవగాహన

**జగిత్యాల నవంబర్ 05 (ప్రజామంటలు):** స్వచ్ భారత్ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల పట్టణంలోని 37వ వార్డులో తడి చెత్త, పొడి చెత్త వేరు చెయ్యడంపై



అవగాహన కార్యక్రమము చేపట్టిన మున్సిపల్ చైర్పర్సన్ డా. భోగ శ్రావణి. ఈ సందర్భముగా చైర్పర్సన్ మాట్లాడుతూ.... ప్రతి ఇంటి నుండి చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి ఇవ్వాలని పట్టణ ప్రజలకి పిలుపునిచ్చారు. పట్టణమును పరిశుభ్రంగా ఉంచడములో గృహిణుల పాత్ర ముఖ్యమని, పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత అని, పట్టణమును స్వచ్ఛ జగిత్యాలగా తీర్చిదిద్దుటకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిఓ లు, రిసోర్స్ పర్సన్స్, వార్డ్ ఆపిసర్, మైనార్టీ నూరు భాషా సంఘము పట్టణ అధ్యక్షులు అబ్దుల్ అజీమ్, అనిల్, కార్యాలయ సిబ్బంది, వార్డ్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్మికులకు

# ప్రెజర్ కుక్కర్ల బహుకరణ

**భీమదేవరపల్లి నవంబర్ 05 (ప్రజామంటలు):** ముల్కనూర్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో దోమకుంట్ల రఘురాములు దాతృత్వము ద్వారా గ్రామపంచాయతీ పారిశుధ్య



కార్మికులకు ప్రెజర్ కుక్కర్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ వాసవి క్లబ్ గవర్నర్ సీతారాం, ముల్కనూర్ వాసవి క్లబ్ గౌరవాధ్యక్షులు అంచూరి వెంకట్రాజం, అధ్యక్షులు భూపతి శ్రీకాంత్, కార్యదర్శి గన్ను కమల్, గ్రామ సర్పంచి మాడుగుల కొమురయ్య, వాసవి క్లబ్ సభ్యులు పెద్ది సూర్యప్రకాశం, బల్లు రమేష్, భూపతి సుధాకర్, బిక్షపతి, రాజలింగం, భూపతి విజయ్ కుమార్, ఐత సాయి తదితరులు పాల్గొన్నారు.



జనగామ మున్సిపాలిటీలో జరిగే 4 సంవత్సరాల ఆడిట్ విషయంలో పారదర్శకంగా ఉండాలని, ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని, ఆడిటింగ్ పూర్తి అయిన తర్వాత పూర్తి సమాచారం కౌన్సిల్ దృష్టికి తీసుకురావాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ రజితకు మున్సిపల్ కౌన్సిలర్ మహంకాళి హరిచంద్ర గుప్తా వినతిపత్రం అందజేత.

## జనగామలో శరవేగంగా

# టీడిపి సభ్యత్వ నమోదు

**జనగామ నవంబర్ 05 (ప్రజామంటలు):** జనగామ తెలుగు దేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మయ్య అధ్వర్యంలో పట్టణంలోని 12 వవార్డు వీవర్స్ కాలనీ



లో టీడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం శరవేగంగా కొనసాగుతుంది. టీడిపి కి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి పట్టణములోని నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పరకాల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర నాయకులు చీకట్ల నవీన్ గౌడ్, పట్టణ ప్రదనాకార్యదర్శి తాళ్లపల్లి ఏల్లేష్, 12వ వార్డు అధ్యక్షులు దోర్నాల యాదగిర, తెలుగు యువత పట్టణ ప్రధాన కార్యదర్శి వుల్లేంగుల అన్వేష్, వీరలక్ష్మి, జ్యోతి, నీర్మాల, అనసూర్య, ఉమ, సునీత, సుభద్ర, రమతారా, బోగా దేవదాస్, పాగ సత్యనారాయణ, శ్రీను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని మార్చాలని

# సీఎం అన్నప్పుడు అందుకే నోరు మెదపలేదా?

● **బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు అలగుర్తి లక్ష్మీనారాయణ**

**జగిత్యాల నవంబర్ 05 (ప్రజామంటలు):** గత రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ ను చేయిపట్టి లాగి అసహనం వ్యక్తం చేస్తూ వేదికపై అవమానిస్తే దాన్ని మంత్రిగారు కేసీఆర్ తనకు తండ్రి లాంటి వాడని సమర్థించుకోవడం సిగ్గుచేటని బిజెపి దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు అలగుర్తి లక్ష్మీనారాయణ విమర్శించారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం లోని రిజర్వేషన్లు అనే భిక్ష ద్వారా ఎన్నికైన దళిత ఎమ్మెల్యేలు ఎంపీలు ముఖ్యమంత్రి రాజ్యాంగాన్ని మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రకటించినప్పుడు తమకు తండ్రి లాంటి వాడు కాబట్టి దళిత ఎమ్మెల్యేలు ఎంపీలు నోరు మెదపలేదా అని ప్రశ్నించారు. అంతేకాకుండా ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి దళితులకు చదువు రాదని దళితులు ఉన్నతాధికారులుగా ఉండడం వల్లే తెలంగాణ అభివృద్ధి చెందడం లేదని మాట్లాడినప్పుడు దళిత ఎమ్మెల్యేలు ఎంపీలు ఎక్కడ పోయారని ఎందుకు స్పందించలేదని అన్నారు. తెలంగాణ ఏర్పడితే తొలి ముఖ్యమంత్రి దళితుడే అని దళితులకు మూడెకరాల భూమి పంపిణీ అని దళితులకు డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తానని రాష్ట్రవ్యాప్తంగా రెండు నెలల్లోగా పదిహేడు లక్షల దళిత కుటుంబాలకు దళిత బంధు 10 లక్షల చొప్పున అందజేస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచిన ఎస్సీ,ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ కు కేసీఆర్ తండ్రి లాంటి వాడు కాబట్టే ప్రశ్నించడం లేదా అని అన్నారు.గతంలో తాటికొండ రాజయ్యను, కడియం శ్రీహరిలను మూన్నాళ్ల ముచ్చటగా ఉప ముఖ్యమంత్రులుగా చేసి వారిని మంత్రివర్గం నుండి తొలగించి దళితులను అవమానపరిస్తే ఒక్క దళిత



ఎమ్మెల్యే కూడా మాట్లాడకుండా తెలంగాణ దళితుల ఆత్మ గౌరవాన్ని కేసీఆర్ మోకాళ్ళ ముందు తాకట్టు పెట్టారని దళితులను ఓటు బ్యాంక్ గా వాడుకొని అవమానాలకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో బీజేపీ దళిత మోర్చా నాయకులు తరాల మహేష్, నక్క జీవన్, సుద్దాల విజయ్, కంటే జస్వంత్, సాయి కుమార్, వంశీ,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పణకు సూచనలు

● **పెన్షనర్స్ అసోసియేషన్ , జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్**

**జగిత్యాల నవంబర్ 05 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర పరితిలోని పదవీ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికేట్ సమర్పణకు ట్రెజరీ రాష్ట్ర డైరెక్టర్ సూచనలు జారీ చేసినట్లు తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ పెన్షనర్స్ సమాచారం కోసం తెలిపారు. పెన్షనర్లు ప్రతి సంవత్సరం 1నవంబర్ నుంచి మార్చి 31 వరకు లైఫ్ సర్టిఫికేట్ ట్రెజరీ అధికారులకు సమర్పించవల్సి ఉంటుంది.లైఫ్ సర్టిఫికేట్ సమర్పణలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని మార్పులు చేశాయి.ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం జీవన్ ప్రమాన్ ద్వారా, రాష్ట్ర ప్రభుత్వం టీ ఆప్ ఫోలియో ద్వారా ఆన్ లైన్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించే విధానం అమల్లోకి తీసుకు వచ్చింది.



అయితే జీవన్ ప్రమాన్ ద్వారా సమర్పిస్తున్న లైఫ్ సర్టిఫికెట్స్ అన్ని సక్సెస్ కావడం లేదు. జిల్లాల్లో ఈ విధానం ద్వారా సమర్పించిన లైఫ్ సర్టిఫికెట్స్ తిరిగి సమర్పించిన పరిస్థితి ఏర్పడింది. టీ యాప్ ఫోలియో ద్వారా సమర్పించినవే సక్సెస్ అవుతున్నాయి. గత సంవత్సరం వరకు టీ యాప్ ను వినియోగించు కోవాలంటే ఓటర్ గుర్తింపు కార్డు నెంబర్ అవసరం ఉండేది.ప్రస్తుతం ఓటర్ గుర్తింపు కార్డు అవసరం లేకుండానే పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పణకు వీలు కల్పించబడ్డది. పెన్షనర్స్ టీ యాప్ ఫోలియో ను సద్వినియోగం చేసుకోవాలి. టీ యాప్ ఫోలియో ద్వారా ఇంటి వద్ద ఉండి లైఫ్ సర్టిఫికేట్ సమర్పించ లేనివారు ట్రెజరీ అఫీసుకు స్వయంగా వెళ్లి ట్రెజరీ సిబ్బంది సహకారంతో డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పించవచ్చని హరి అశోక్ కుమార్ పెన్షనర్స్ సమాచారం కోసం వివరించారు.

# శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతిని ఘనంగా నిర్వహించిన రాజకుమార్

**చిగురుమామిడి నవంబర్ 05 (ప్రజామంటలు):** చిగురుమామిడి విశ్వబ్రాహ్మణ మండల కమిటీ ఆధ్వర్యంలో కాలజ్ఞాన తత్వవేత్త సంఘ సంస్కర్త శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 414 వ జయంతి కార్యక్రమం చిగురుమామిడి మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజకుమార్ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వామివారి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రసాదాలు టెంకాయలు సమర్పించి పూజాది కార్యక్రమాలు నిర్వహించి పాటల రూపంలో స్వామి కీర్తిని కొలుస్తూ నిర్వహించారు. రాజకుమార్ మాట్లాడుతూ.... ఏ చిన్న వింత జరిగినా విచిత్రం జరిగిన అంత బ్రహ్మంగారు చెప్పినట్టే జరుగుతుంది అని అంటారు. 16వ శతాబ్దంలో జన్మించిన అవతార పురుషుడు వీరబ్రహ్మం కలియుగ దైవమై కుల మతాలకు అతీతంగా సంపత్తి భోజనాలు పెట్టి కుల, మత, భాష, లింగ భేదం అనేది లేదని ఆనాడే చెప్పిన గొప్ప సంఘసంస్కర్త సాంద్రసింధు వేదమైన భూత భవిష్య వర్తమాన కాలజ్ఞాన తత్వాలను రాసి పామరులందరికీ భవిష్యత్తులో జరగబోయే విషయాలన్నీ కళ్ళకు కట్టినట్టు చెప్పిన గొప్ప మహానుభావుడు ఆయన జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా జరిపాలని ఆ మహానుభావుని జీవిత గాధను పాఠ్య పుస్తకంలో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్ తో పాటు మండల ముఖ్య బాధ్యులు గొల్లపెల్లి సదాచారి, గుగ్గిళ్ళ వేణుమాధవ్, అనువోజు బాల కృష్ణమచారి, దంచనోజు



సదానంద చారి, కనపర్తి బ్రహ్మానందచారి, రాజేందర్, రవీంద్ర చారి, వెంకటయ్య, చంద్రమౌళి, సదాచారి, చిరంజీవి, రవింద్రచారి, శ్రీనివాస్, సత్తయ్య, నర్సింహచారి, రమేష్, కుమారస్వామి, సుధాకర్ వెంకటరమణ, సంపత్, కొమురయ్య, రాజయ్య, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా క్షీరాబ్ధి ద్వాదశి వేడుకలు

**ధర్మపురి నవంబర్ 05 (ప్రజా మంటలు) :** సుప్రసిద్ధ గోదావరి సుప్రసిద్ధ గోదావరి తీరస్థ ప్రాచీన పుణ్య క్షేత్రమైన ధర్మపురిలో కార్తీక శుద్ధ ద్వాదశి పర్వదిన వేడుకలు శనివారం ఘనంగా, వైభవంగా జరిగాయి. కార్తీక శుద్ధ ద్వాదశికి ప్రత్యేకత ఉంది. క్షీరాబ్ధి ద్వాదశిగా పిలువబడే ద్వాదశి పంచ పర్వాలలో ప్రధానమైనది. ప్రబోధనైకాదశి అనబడే కార్తీక శుద్ధ ఏకాదశి నాడు విష్ణుమూర్తి క్షీరాబ్ధి నుండి బయలు వెడలి, ద్వాదశి నాడు తులసి బృందావనంలో ప్రవేశిస్తారు. అందుకనే ఈరోజు తులసీపూజ ఆచారంగా మారింది. క్షీర సము ద్రాన్ని మధించిన రోజైనందున "మధన ద్వాదశి లేదా చిలుకు ద్వాదశి" అని పిలుస్తారు. కొందరి ఆచారం ప్రకారం ఈనాడు చాతుర్మాస్య దీక్ష వ్రత సమానమని అమాదేర్ జ్యోతిషి గ్రంథం చెపుతున్నది. మన్వాది తిథి అనికూడా వాడుకలో ఉంది. ప్రధానంగా క్షీరాబ్ధి శయనుడైన విష్ణువు కార్తీక శుద్ధ ద్వాదశి నాడు లక్ష్మి, బ్రహ్మ మొదలగు వారితో కూడి తులసి బృందావనికి వస్తాడని, ఈనాడు సూర్యాస్తమయం తర్వాత విష్ణువును పూజించి, దానాలు ముఖ్యంగా దీప దానం చేయాలని చెపుతారు. లక్ష్మీ అవతారమైన తులసికోట వద్ద కర్ర పాతి, ఆకాశ దీపం పెట్టాలని శాస్త్ర వచనం. కార్తీక శుద్ధ ఏకాదశి మొదలు ఐదు రోజులలో కుల, దేశాచారాలను బట్టి తులసి వివాహం చేస్తారు. వివాహ రుతువుకు తులసి వివాహం పురోగామి, పంచ పర్వాలలో ప్రత్యేకతను కలిగిన ప్రధాన దినమైన శనివారం కార్తీక శుద్ధ



ద్వాదశి యుక్త పర్వ దినాన్ని పురస్కరించుకుని విచ్చేసిన భక్తులు, స్థానికులు ఉదయాత్పూర్వం నుండే పవిత్ర గోదావరిలో మంగళ స్నానాలను ఆచరించారు. గోదావరి మాతను అర్చించి, కార్తీక దీపాలను దొప్పలలో నదిలోకి వదిలారు.

# దళిత బంధు యూనిట్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**రాయికల్ నవంబర్ 05 (ప్రజామంటలు):** రాయికల్ మండల అయోధ్య గ్రామానికి చెందిన కొరేపు మధు కు, జగిత్యాల రూరల్ మండల అంతర్గం గ్రామానికి చెందిన రసమెల శంకర్ కి దళిత బంధు పథకం ద్వారా మంజూరైన మారుతి ఏర్టిగ వాహనాలను జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో లబ్ధిదారులకి అందజేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



## అందోల్ నుండి జోగిపేట భారత్ జోడో యాత్రలో

# రాహుల్ గాంధీతో పాల్గొన్న సుజిత్ రావు

**మెట్ పల్లి నవంబర్ 05 (ప్రజామంటలు):** అందోల్ నుండి జోగిపేట భారత్ జోడో యాత్ర లో బావిభారత ప్రధాని రాహుల్ గాంధీ తో



పాల్గొన్న టిపిసిసి డేల్ గెట్ భారత్ జోడో యాత్ర పబ్లిసిటీ మెంబర్ కల్వకుంట్ల సుజిత్ రావు పాల్గొన్నారు. వారు మాట్లడుతూ.... దేశ ఐక్యత కోసం కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేస్తున్న రాహుల్ గాంధీ తో దేశప్రజలంతా పాదయాత్రలో స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని మరియు ముఖ్మంగా తెలంగాణ లో రాహుల్ గాంధీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ముఖ్యంగా వరగల్ డిక్లరేషన్ తో రైతులు ఉపాధి కూలిలు కార్మికులు, బీడీ కార్మికులు, యసి.యస్. టి., బి.సి., మైనార్టీ కాంగ్రెస్ పార్టీ రావాలని కోరుకుంటున్నారని కొనియాడారు.

## జనగామ ప్రెస్టన్ ఇన్స్టిట్యూట్ కాంపౌండ్ నిర్మాణం

**జనగామ నవంబర్ 05 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కేంద్రంలోని



ప్రెస్టన్ ఇన్స్టిట్యూట్ కాంపౌండ్ గోడను భారత స్వర్ణత్సవాల సందర్భంగా మున్సిపల్ అధికారులు ప్రెస్టన్ ప్రహరీ గోడలు మీటింగ్ నిమిత్తం కూలగొట్టారు. ఎన్నిసార్లు విన్నవించిన తిరిగి కట్టకుండా నిర్లక్షం చేస్తున్నారు. శనివారం అగాపే ఇంటర్ పెయిత్ మినిస్ట్రీ ఫౌండర్ కె.ఎం. జాన్ సహకారంతో ప్రెస్టన్ ఇన్స్టిట్యూట్ కరస్పాండెంట్ బక్క ప్రవీణ్ కుమార్, ఫీల్డ్ నాయకులు దామెర జేమ్స్ పర్యవేక్షణలో ప్రహరీ గోడలు నిర్మిస్తున్నారు.

## భారత్ జోడో యాత్ర లో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి లతో కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

**జనగామ నవంబర్ 05 (ప్రజామంటలు):** భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి లతో మాజీ ఎమ్మెల్యే, పిసిసి సభ్యులు



కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... యువ నాయకులు రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేస్తున్న భారత్ జోడోయాత్రలకు అపూర్వ స్పందన వస్తుందని, జోడో యాత్రలో అన్ని వర్గాల ప్రజలను కలుస్తూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ పాదయాత్ర సాగిస్తున్నారన్నారు. త్యాగాల కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి మన రాహుల్ గాంధీ నాయనమ్మ ఇందిరా గాంధీ, తండ్రి రాజీవ్ తీవ్రవాదుల చేతుల్లో హతమైన ఎలాంటి అదురు బెదురు లేకుండా తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలను గద్దె దించేందుకే పాదయాత్ర చేస్తున్నారని అన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగులను సత్కరించిన మునిసిపల్ చైర్పర్సన్ డా. భోగ శ్రావణి

**జగిత్యాల నవంబర్ 05 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జగిత్యాల జిల్లా శాఖ ఎన్నికలలో విజయం సాధించిన జిల్లా కార్యవర్గ సభ్యులు జగిత్యాల మనిసిపల్ చైర్పర్సన్



డా.భోగ శ్రావణి ప్రవీణ్ లను మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియచేసారు. జిల్లా అధ్యక్షులు ఎల్ల గంగరాజం ని, జిల్లా ప్రధాన కార్యదర్శి కరబూజ రవీందర్ ని మరియు కోశాధికారి మెట్ట మల్లికార్జున్ తదితరులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా మరియు యూనిట్స్ కార్యవర్గ సభ్యులు ఎస్. గంగారాం, డి. నర్సయ్య, పి. కమలాకర్ రెడ్డి, కనకతార, గుండేటి గంగాధర్, ఎం. సత్యనారాయణ రావు, కొలిచాల రవీందర్, అనంతుల విట్టలయ్య, వైద్య బాల మురళీకృష్ణ, కే. అంజయ్య, పోలుకారు చిన్న రాజయ్య, ఎ. ఈశ్వరయ్య, మీసాక్ అహ్మద్, ఎస్. రవీందర్ మరియు గుండేటి రవీందర్ హాజరైనారు.

# బిజెపి రాజకీయ మనుగడకు సవాల్‌గా మునుగోడు!

మునుగోడులో ఓటర్లు ఎవరిని గెలిపించినా కొన్ని మౌలిక ప్రశ్నలను మాత్రం లేవనెత్తనున్నాయి. అనవసరంగా వచ్చిన ఉప ఎన్నిక కారణంగా కోట్లాది రూపాయలు ఇక్కడ నీళ్ల ప్రాయంగా ఖర్చు చేశారు. ఇంత డబ్బు ఎక్కడిదన్న ప్రశ్నలపై చర్చించాలి. ఇంతగా డబ్బును ఓట్ల కోసం ఖర్చు చేయాల్సిన అవసరం ఉందా అన్నది చర్చించాలి. అలాగే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఒక ఉప ఎన్నికను ఎందుకు కోరుకున్నదన్నది కూడా చర్చించాలి. ఇలాంటి సవాళ్ల రాజకీయాలు అసవరమా అన్న చర్చ చేయాలి. గెలిస్తే తొడగొట్టడానికి ఈ ఉప ఎన్నిక ఫలితం బిజెపికి ఉపయోగపడుతుంది. అయితే ఉప ఎన్నిక అవసరం లేకున్నా తెచ్చిన బిజెపి దేశం ఎదుర్కొంటునన అనేక సమస్యలపై ఎక్కడా ప్రస్తావించలేదు. కేవలం కెసిఆర్‌కు వ్యతిరేకంగా మాత్రమే ఈ ఎన్నికను ప్రొజెక్ట్ చేయడం వల్ల ఇప్పుడు కెసిఆర్ గెలుస్తారా లేక బిజెపి గెలుస్తుంద అన్నది ఇక్కడ కీలకం కానున్నది. బిజెపి గెలిస్తే తెలంగాణలో కెసిఆర్‌ను మరింత తీవ్రంగా ఢీకొనే కార్యక్రమాలనపైనే బిజెపి దృష్టి సారిస్తుంది. అంతేతప్ప ప్రజల సమస్యలపై ఎక్కడా దృష్టి పెట్టది. తదుపరి అధికారం కోసమే తన దృష్టిని పెడుతుంది. ఇకపోతే టిఆర్‌ఎస్ గెలిచినా అదే జరుగు తుంది. బిజెపికి వ్యతిరేకంగా కెసిఆర్ చేపట్టిన ఆందోళనలను కెసిఆర్ మరింత తీవ్రం చేస్తారు. జాతీయ రాజకీయాల్లో మరింత చురుకుగా పాల్గొంటారు. ఈ క్రమంలో ప్రజలు కూడా ఆసక్తిగా ఈఫలితం కోసం ఎదురు చూస్తున్నారు. దేశం యవాత్తూ కూడా దీనిపై దృష్టి కేంద్రీకరించింది. ప్రజలు ఎవరిని గెలిపించ బోతున్నారో అన్నది ఇప్పుడు చర్చగా మారింది. బిజెపి తొందరపాటు కారణంగా వచ్చిన ఉప ఎన్నిక 3న ముగియగా, ఆదివారం 6న కౌంటింగ్ చేపట్టనున్నారు.



అయితే సర్వేలన్నీ టిఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఉన్నా, బిజెపి కూడా గెలుపు ధీమాతోనే ఉంది. గత రెండు నెలలుగా మునుగోడులో ప్రజలను తమవైపు తిప్పుకోవడానికి అన్ని ప ఆర్టీలు తీవ్రంగానే ప్రయత్నించాయి. టీఆర్‌ఎస్ గెలవబో తోందన్న ఎగ్జిట్ పోల్స్ నిజమైతే తెలంగాణ రాకీయాల్లో ఇక టీఆర్‌ఎస్‌కు తిరుగు ఉండదు. బిజెపికి కూడా పెద్దగా ప్రభావం ఉండదు. బిజెపి దూకుడుకు కొంత బ్రేక పడనుంది. అయితే బిజెపి ఇప్పటికైనా నిజాయితీగా ప్రజల పక్షాన నిలబడిపోరాడాలి. 92 శాతానికి పైగా పోలింగ్ జరడంతో అందరిలోనూ గెలుపుపై ధీమా ఉంది. టీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ పోరులో టీఆర్‌ఎస్ సర్వశక్తులను ఒడ్డింది. ఈ ఫలితం అనుకూలంగా వచ్ఇచనా, వ్యతిరేకంగగా వచ్చినా బిజెపి అనేక సమస్యలపై ప్రజల కోణంలో ఆలోచన చేయాలి. జిఎస్టీ వాయింపులను తగ్గించాలి. అలాగే నిరుద్యోగం, ధరలపై దృష్టి సారించాలి. లేకుంటే వచ్చే ఎన్నికల్లో అధికారం తమదే అన్న ధీమాలో ఉన్న బీజేపీకి ఈ ఉప ఎన్నిక ఓ గుణపాఠం కాగలదు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజీనామాతో మునుగోడు ఉప ఎన్నికను కోరి తెచ్చుకున్న బిజెపి వ్యూహా త్మక తప్పిదం చేసినట్లుగానే భావించాలి.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రం పట్టించుకోవడం లేదు. బీజేపీ విసిరిన సవాల్‌తో ఇప్పుడు మునుగోడులో వచ్చే ఫలితం దేశ రాజకీయాల పైనా ప్రభావం చూపనుంది. గుజరాత్,హిమాచల్‌లో ఎన్నికలు జరగబోతున్న వేల దక్షిణాదిలో బిజెపి ప్రభావం ఎలా ఉంటుందన్నదని కూడా తెలియగలదు. సాధారణ ఎన్నికలకు సరిగ్గా ఏడాది ముందు మునుగోడు ఉప ఎన్నిక జరగడంతో.. 2023 ఎన్నికలకు ఇది సెమీ ఫైనల్ అనే చర్చ జరుగుతోంది. దక్షిణాదిలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పాగా వేయాలనుకుంటున్న బిజెపికి ఇది లిట్మస్ టెస్ట్ లాంటిది. దాదాపు మూడు నెలలుగా జరిగిన వివిధ రాజకీయ పరిణామాల అనంతరం.. ఎన్నిక జరిగింది. గతంలో ఎపపుడూ ఎక్కడా జరగనట్లుగా రాత్రి 11 గంటల వరకు మునుగోడు నియోజకవర్గంలో పోలింగ్ జరిగింది. మునుగోడులో సవాల్ విసిరిన బిజెపికి తెలంగాణలో తొలి పరాభవం ఎదురయితే ఇక్కడ పార్టీ విసరణకు విఘాతం కలగవచ్చు. బిజెపి ఓడితే జరిగేది అదే అనడంలో ఎలాంటి సందేహం లేదు. మునుగోడులో ఓడిపోతే బిజెపి రాజకీయ భవిష్యత్ గందరగోళంలో పడడం ఖాయం. ఎందుకంటే రాజకీయంగా అడుగు వేయడానికి బిజెపికి అడ్డంకులు వస్తాయి. బీజేపీ ఇంతా చేసి ఒక్కసీటును గెలవలేదన్న విమర్శలను కూడా తప్పించు కోలేదు. ఓడిపోయిన బీజేపీకి రాజకీయంగా ప్రాధాన్యత దక్కదు. అది బిజెపి వైఫల్యంగానే చూస్తారు. బిజెపి చేజేతులా భవిష్యత్‌ను దెబ్బతీసుకుందన్న విమర్శలను మూటగట్టుకోవాల్సి ఉంటుంది. మునుగోడు ఎన్నిక బిజెపిని రాజకీయంగా సమాధి చేసినా ఆశ్చర్య పోవాల్సి పనిలేదు. మునుగోడు ఉప ఎన్నికపై ఏ పార్టీ అంచనా ఎలా ఉన్నా.. బిజెపి పట్ల మాత్రం ప్రజల్లో పెద్దగా సానుభూతి మాత్రం లేదు. బీజేపీ నేతలు పోల్ మేనేజ్‌మెంట్‌లో విఫలం అయ్యారని విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రజలకు దగ్గర కావాలంటే విప్లవాత్మక నిర్ణయాలను బజెపి తీసుకోవాల్సి ఉంటుంది. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అయినా ఈ నిర్ణయాలు తీసుకోక తప్పదు. ప్రధానంగా జిఎస్టీ స్లాబ్‌ల విషయంలో పునరాలోచన చేయాలి.నిత్యావసర ధరలు, ఔషధాల ధరలు, గృహనిర్మా సంబంధ వస్తువుల ధరలను అదుపు చేయాలి. నిరుద్యోగుల ఉద్యోగాలపై భరోసా ఇవ్వాలి. అప్పుడే బిజెపిని ప్రజలు నమ్మగలరని గుర్తించాలి.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం


"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు, "నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్

## ప్రేమ -పెళ్లి

చింటూ మరియు చిన్ని చాలా రోజుల నుండి ప్రేమ లో ఉన్నారు. ఇంట్లో వాళ్ల పరిమితులు, అర్థం లేని కట్టుబాట్ల వల్ల ఈ మధ్య కాలంలో వాళ్ళు కలుసుకోవడం లేదు. దాదాపుగా ఆరు నెలలు దాటింది. రోజూ కాసేపు వీడియో కాల్స్, చాటింగ్, ఇన్స్టా రీల్స్ షేర్ చేసుకోవడం, స్నాప్ చాట్ స్ట్రీక్స్ తో సమయం గడిపే వారు. కలుసుకుందామని అనుకున్నా కూడా ఇంట్లో వాళ్ళకి తెలిస్తే మళ్ళీ సమస్య అవుతుందని మనసు లోనే కుమిలిపోసాగారు.

కొన్ని నెలలు గడిచిపోయాయి ఒకరోజు పొద్దున్నే చింటు వీడియో కాల్ చేసి, తనకి ఒంట్లో బాలేదు చాలా జ్వరం గా ఉంది అని చెప్పాడు. ఆ మాటతో చిన్నికి నోట మాట రాలేదు. రోజంతా ఏడుస్తూనే ఉంది. ఎలాగైనా చింటుని కలవాలని నిర్ణయిచుకుంది. ఏది ఏమైనా కానీ, ఇక చింటు తోనే తన జీవితం అని మనసులో గట్టిగా అనుకుంది. చింటు దగ్గరకి చేరడానికి నాలుగు గంటల ప్రయాణం. దానికోసం తన ఇంటి



పక్కనే ఉన్న బన్నీ సహాయం అడిగింది.చిన్నప్పటి నుండి బన్నీ మరియు చింటు చాలా మంచి స్నేహితులు కావడం తో చిన్ని అడగగానే ఒప్పుకున్నాడు బన్నీ. ఇక రాత్రి అందరూ పడుకున్న తర్వాత రాత్రి 1 గంటల కి బన్నీ కారు లో వెళ్లాలని అనుకున్నారు. చాలా నెలల తరువాత తన ప్రేమికుడిని చూస్తున్నాననే సంతోషం తో చింటు కి ఇష్టమైన జిలేబి ని తానే తయారు చేసింది.మళ్ళీ ఈ జన్మ లో ఈ ఇంటికి రాకూడదు అని తనకి ఇంట్లో ఇష్టమైన వస్తువులు, బట్టలు మరియు ఫ్యామిలీ ఫోటో సర్దుకుంది.

అనుకున్న సమయానికే అందరూ నిద్రలోకి జారుకున్నారు. ఇక చిన్ని , బంటీ లు బయలుదేరారు. రోడ్ అంతా నిశబ్ధంగా ఉంది. చిన్ని మనసు లో మాత్రం ఎపుడెపుడు చింటునీ చూద్దామా అని తన మనసు తహతహాడిపోతోంది.కారు కంటే వేగంగా తన మనసు పరిగెడుతుంది. ఉదయం 5-30 గంటలకి చింటు ఇంటికి చేరుకున్నారు. చింటు ఇల్లు అంతా నిశబ్దం గా ఉంది. వాళ్ళింట్లో వాళ్లందరు వేరే ఊరికి వెళ్లి నాలుగు రోజులు అయింది. చింటు ఇంటి ముందే మంచం లో పడుకుని ఉన్నాడు. చిన్ని ఎంత తట్టి లేపిన లేవడం లేదు. అప్పటికే హార్ట్ ఎటాక్ తో అతని గుండె ఆగిపోయింది. చిన్ని వెక్కి వెక్కి ఏడ్చి తను కూడా ఊపిరి వదిలింది.

ఇదంతా చూస్తున్న బన్నీ కి ఏమి చేయాలో అర్థం కావట్లేదు. కంట్లో నుండి ఉబికి వస్తున్న కన్నీళ్ళను ఆపుకుంటూ, యాభై సంవత్సరాల క్రితం ప్రేమించుకున్న చింటు,చిన్ని లకు పెళ్లి చేయడానికి ఇలానే తన బైక్ పై తీసుకెళ్ళాడు. ఇప్పుడు ఆదే విధంగా వీరి చివరి ప్రయాణం లో కూడా ఇలా అనుకోకుండా భాగం అయ్యాడు. పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్న చింటు, చిన్ని చాలా అన్యోన్యంగా జీవించారు కానీ వారి ఇద్దరి కొడుకుల మధ్య ఆస్తి తగాదాలు, గొడవల కారణంగా వారు ఆస్తి తో పాటు తల్లి ,తండ్రులను కూడా పంచుకున్నారు.చింటూ, చిన్ని లు కలుసుకునే అవకాశం కొడుకులు ఎప్పుడూ కల్పించలేదు.ఎలాగైనా ఈరోజు చూడాలని చిన్ని వస్తే,చింటూ అందనంత దూరం వెళ్ళిపోయాడు.


పెద్దలను ఎదిరించి చేసుకున్న వీరి పెళ్లి గెలిచింది కానీ కని పెంచిన పిల్లల కారణంగా వీరి ప్రేమ ఓడిపోయింది.

– గౌరాయపల్లి ప్రణయ్ కుమార్.
రాజగోపాలపేట, సిద్దిపేట జిల్లా
9949177854

# నడిచే విజ్ఞాన సర్వస్వం కపిలవాయి లింగమూర్తి

## నవంబర్ 6... కవి కేసరి వర్ధంతి

కపిలవాయి లింగమూర్తి (మార్చి 31, 1928 నవంబర్ 6, 2018) పాలమూరు జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, సాహితీ పరిశోధకుడు. పద్య రచనతో ఆయన ప్రస్థానం ఆరంభమైనా కథా రచన, విమర్శ ప్రక్రియతో వెలుగులోకి వచ్చారు. జానపద సాహిత్యం, పాలమూరు జిల్లా లోని దేవాలయాలపై విస్తృత పరిశోధనలు చేశాడు. 70 కి పైగా పుస్తకాలు రచించాడు. ఈయనకు కవి కేసరి అనే బిరుదు



ఉంది. తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేటు అందుకున్న తొలివ్యక్తి కపిలవాయి లింగమూర్తి.

ఆయన అచ్చంపేట తాలుకా, బల్మూర్ మండలం, జినుకుంటలో మాణిక్యమ్మ, వెంకటాచలం దంపతులకు మార్చి 31, 1928కు సరియైన ప్రభవ నామ సంవత్సరం మాఘ శుద్ధ నవమి నాడు జన్మించారు. ఆయనకు రెండున్నరేళ్ళ వయసులో తండ్రి మృతి చెందడంతో మేనమామ పెద లక్ష్మయ్య దగ్గర పెరిగారు. పాఠశాల విద్యను ఉర్దూ మాధ్యమంలో పూర్తి చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్ పరీక్షలు రాసి తెలుగులో విశారద ప్రమాణ పత్రాన్ని సంపాదించారు. అనంతరం ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి ఎం.ఏ. (తెలుగు) పట్టా పొంది 1954లో నాగర్‌కర్నూల్ జాతీయోద్యమ పాఠశాలలో తెలుగు పండితునిగా చేరారు. ఆ తర్వాత 1972 లో పాలెం శ్రీవేంకటేశ్వర ప్రాచ్య డిగ్రీ కళాశాలలో ఉపన్యాసకుడుగా చేరి దశాబ్దం పాటు సేవలందించి 1983లో ఉద్యోగ విరమణ పొందారు. లింగమూర్తి నడిచే విజ్ఞాన సర్వస్వంగా పేరుపొందారు. పలుగ్రంథాలు, పరిశోధనలు రచించి సాహితీవేత్తగా పేరుపొందాడు.

కపిలవాయికి తెలుగు విశ్వవిద్యాలయం 26.8.2014 న గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. 30.08.2014 రోజున విశ్వవిద్యాలయం 13వ స్నాత కోత్సవంలో చాన్సలర్, రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను అందించారు. తెలంగాణ రాష్ట్రంలో తెలుగు యూనివర్సిటీ నుంచి తొలి గౌరవ డాక్టరేట్ పొందిన వ్యక్తిగా కపిలవాయికి ఈ ఘనత దక్కింది. 1954 నుంచి 1983లో పదవీ విరమణ పొందే వరకు నాగర్‌కర్నూల్ లోని జాతీయోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి, అక్కడే స్థిరపడ్డారు. అనేక స్థలచరిత్రలు, దేవాలయాల కథలకు ఆయన ప్రాణంపోశారు. మొత్తం 70 రచనలు ముద్రితమయ్యాయి. 11రచనలు ద్విముద్రితాలు, 25 రచనలు ముద్రించాల్సి ఉంది.

సమైక్యరాష్ట్రంలో తెలంగాణ కవులు, సాహితీ వేత్తలకు అన్యాయం జరిగింది. జీవోలు తెలుగులో రావాలి. పాఠశాలల్లో తెలుగు బోధించాలి అని సూచనలు చేశారు. ఆయన శతాధిక రచనలు చేశాడు. కపిలవాయి లింగమూర్తి కావ్యాలు, గీతాలు, శతకాలు, వచన సాహిత్యం, స్థల చరిత్రలు, బాల సాహిత్యం మొదలగు వివిధ సాహిత్య ప్రక్రియలలో రచనలు చేశారు. ఈ రచనలపై పలువురు విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పటికి వీరి రచనలపై వివిధ విశ్వ విద్యాలయాలలో ఆరు సిద్ధాంత గ్రంథాలు రూపొందినవి. 1992లో కవితా కళానిధి, పరిశోధనా పంచానన, 1996లో కవికేసరి, 2005లో వేదాంత విశారద,2010లో గురు శిరోమణి, 2012లో సాహిత్య స్వర్ణ సౌరభ కేసరి, సాహితీ విరాణ్మూర్తి తదితర బిరుదులు, సత్కారాలు పొందారు. కపిలవాయి లింగమూర్తికి సాహిత్య రంగంలో చేసిన విశేషకృషికి గుర్తింపుగా రాష్ట్ర స్థాయిలో అనేక సందర్భాలలో సన్మానాలు జరిగాయి. 1983లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వీరిని సన్మానించారు. తరువాత నారా చంద్రబాబు నాయుడు, వై.యస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నకాలం లోనూ వారిచే సన్మానాలు పొందారు. తెలంగాణ రాష్ట్ర సమితి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆయనను సన్మానించారు. నలుగురు ముఖ్యంత్రులచే సన్మానింపబడిన ఏకైక తెలుగు కవి, పరిశోధకులు కపిలవాయి లింగమూర్తి. ఇంకా తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభాపురస్కారం, బూర్గుల రామకృష్ణారావు ప్రతిభా పురస్కారం, బ్రౌన్ సాహిత్య పురస్కారం, నోరి నరసింహశాస్త్రి పురస్కారం, కందుకూరి రుద్రకవి పురస్కారం, పులికంటి సాహితీ పురస్కారం, బి.ఎన్.శాస్త్రి స్మారక పురస్కారం మొదలైన ఎన్నో సత్కారాలను పొందాడు.

వెన్నెల సాహిత్య అకాడమీ కపిలవాయి లింగమూర్తి జీవితం, సాహిత్య సృజన, పరిశోధనలపై కవితా కళానిధి కపిలవాయి లింగమూర్తి పేరుతో ఓ డాక్యుమెంటరీని రూపొందించింది.

దీనికి 2011లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ రెండో డాక్యుమెంటరీ చిత్రంగా నంది అవార్డును ప్రకటించింది.



-ఆర్కె సంగనభట్ల
9440595494

# ధాన్యాగారంగా మారిన తెలంగాణ

### ధాన్యం కొన్న రెండు రోజుల్లోనే నగదు జమ

### కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి హరీష్ రావు

**సిద్దిపేట,నవంబర్5:** దేశానికి అన్నం పెట్టే ధాన్యగారంగా తెలంగాణ మారిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పారు. ఎఫ్‌సీఐ నుంచి రావాల్సిన డబ్బులు రాకున్నా.. తెలంగాణ రాష్ట్రం వరి



ధాన్యం కొంటుందన్నారు. నంగునూరు మండలం సిద్దన్నపేట మార్కెట్‌యార్డులో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలో 5 లక్షల మెట్రిక్ టన్నుల



వరిధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

క్వింటాల్‌కు రూ. 2,060 గా నిర్ణయించామని తెలిపారు. గతంలో ఎప్పుడు కూడా ఇంత పంట పండలేదన్నారు. వడ్లు కొనమంటే బీజేపీకి చేతకాదు కానీ.. రూ. 100ల కోట్లు పెట్టి ఎమ్మెల్యేలను కొంటోందని మండిపడ్డారు. ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలన్నారు. ఈ సాగు లాభదాయకంగా ఉంటుందని మంత్రి హరీశ్‌రావు చెప్పారు.వరి ధాన్యం కొనమంటే కేంద్రం కొనడం లేదని మంత్రి హరీష్ రావు మోడీ ప్రభుత్వంపై విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బిజెపి కుట్రలు చేస్తుందని ధ్వజమెత్తారు.

# ఎమ్మెల్లేల కొనుగోళ్లలో సిద్ధహస్తుడు

### కాంగ్రెస్‌ను పొగిడి దానినే ఖతం చేయాలని చూశాడు - టిఆర్ఎస్ పాలనపై కెసిఆర్ చర్చకు రావాలి: ఈటెల

**హైదరాబాద్,నవంబర్5:** ఎమ్మెల్యేల కొనుగోళ్లలో కేసీఆర్ రారాజుగా మిగిలారని బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లాగా కొనుగోలు చేసిన సీఎం కేసీఆర్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. నిండు అసెంబ్లీలో తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని పొగిడిన కేసీఆర్..అదే అసెంబ్లీలో కాంగ్రెస్‌ను ఖతం పట్టించారని మండిపడ్డారు.శనివారం మీడియాతో మాట్లాడుతూ... 2014 నుంచి టీఆర్ఎస్ సర్కార్ పరిపాలనపై కేసీఆర్తనతో చర్చకు రావాలని సవాల్ విసిరారు. మీడియాపై విషం చిమ్మిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంపై సీఎం కేసీఆర్‌వి మొసలి కన్నీళ్ళని అన్నారు. నలుగురు ఎమ్మెల్యేలు పరమ పవిత్రులు ఎలా అవుతారో కేసీఆర్ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. హుజూరాబాద్‌లో జరిగిందే... మునుగోడులో జరిగబోతోందని స్పష్టం చేశారు. ఉప ఎన్నిక నిర్వహణలో ఎన్నికల కమిషన్ విఫలమైందన్నారు. ఓటమి భయంతోనే మునుగోడులో టీఆర్ఎస్ హింసను ప్రేరేపిం చిందని ఆయన ఆరోపించారు.మంత్రులు, ఎమ్మెల్యేలు స్వయంగా మునుగోడులో ఓటుకు నోట్లు పంచారన్నారు. దళిత ముఖ్యమంత్రిని చేస్తానన్న కేసీఆర్.. మంత్రి కొప్పుల ఈశ్వర్ ను అవమానించారని అన్నారు. టీఆర్ఎస్‌కు ఓటు వేయకుంటే.. పథకాలు రావని మంత్రి హెచ్చరించటం దారుణమని మండిపడ్డారు. ఓడిపోయిన ఎమ్మెల్యేలతో నియోజకవర్గాల్లో అధికారిక కార్యక్రమాలు. నిర్వహిస్తున్నా రన్నారు. కేసీఆర్ హాయాంలో ప్రజాస్వామ్య ఖూనీ అయిందని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవాన్ని సీఎం కేసీఆర్ మంట గలిపారని మండిపడ్డారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను టీఆర్ఎస్‌లో ఎలా చేర్చుకున్నారో చెప్పాలన్నారు. కేసీఆర్ అసలు రూపం తెలంగాణ ప్రజలకు అర్థమైందన్నారు. కేసీఆర్ మాటలు, చేతలకు పొంతన లేదని ఈటల రాజేందర్ వ్యాఖ్యలు చేశారు. 2014లో టిడిపి ఎమ్మెల్యేను చేర్చుకుని మంత్రి పదవి ఇవ్వలేదా అని ప్రశ్నించారు. 2018లో కాంగ్రెస్ ఎమ్మెల్యేను చేర్చుకుని మంత్రి పదవి కట్టబెట్టింది నిజం కాదా అన్నారు. ఏ ఎమ్మెల్యేను కూడా రాజీనామా చేయించకుండా పార్టీలో అక్రమంగా చేర్చుకున్న కేసీఆర్.. ప్రజాస్వామ్యంపై ప్రేమ ఒలకపోస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని మీడియాను అభ్యర్థించారని..అసలు..మీడియా, మీడియా ప్రతినిధుల మీద దాడి చేసింది కేసీఆర్ కాదా ? అన్నారు. వ్యతిరేకంగా వార్తలు రాసిన ఛానళ్లను కొనుగోలు చేయలేదా అని ప్రశ్నించారు. చట్టాలను చట్టుబండలు చేసి..చట్టాలను కాపాడాల్సిన అధికారులను బానిసలు చేసుకుని.. ప్రజాస్వామ్యాన్ని అగౌరపర్చిన వ్యక్తి కేసీఆర్ అని మండిపడ్డారు. గతంలో రేవంత్ రెడ్డిపై ఓటుకు నోటు కేసు పెట్టిన కేసీఆర్‌పై కూడా ఓటుకు నోటు కేసు పెట్టాలని ఈటల రాజేందర్ అన్నారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ఓటుకు రూ. 6వేల చొప్పున టీఆర్ఎస్ పంపిణీ చేసిందన్నారు. తమకు టీఆర్ఎస్సే డబ్బులు ఇచ్చిందని ఓటర్లే వెల్లడించారన్నారు. ఇది ఓటుకు నోటు కేసు కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలపై ఓటుకు నోటు కేసు పెట్టాలన్నారు. ఓటుకు అమ్ముడుపోవద్దు..డబ్బులు తీసుకుని ఓటు అమ్ముకోవద్దని మునుగోడులో ఫ్లెక్సీలు కట్టిన టీఆర్ఎస్...ప్రజలు డబ్బులు పంపిణీ చేయలేదా అన్నారు.



సీఎం కేసీఆర్ ఎప్పుడు కూడా ప్రజలపై ప్రేమతో సంక్షేమ పథకాలు అమలు చేయడని ఈటల రాజేందర్ తెలిపారు. ఓట్ల సమయంలో పథకాలను ప్రకటిస్తారని..ఓట్లు అయిపోయాక..వాటిని అమలు చేయడన్నారు. హుజురాబాద్ ఎన్నికల సమయంలో తీసుకొచ్చిన దళితబంధు పథకాన్ని ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంతమందికి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. 2014 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎన్ని నెరవేర్చారో...2018 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎన్ని అమలు చేశారో..కేసీఆర్ చెప్పాలన్నారు.

# ఎమ్మెల్యేల రాజీనామాలకు డిమాండ్లు

### రాజీనామా చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఫోన్ కాల్

**జగిత్యాల,నవంబర్5:** మునుగోడు ఉప ఎన్నికతో ఎమ్మెల్యేల రాజీనామా డిమాండ్లు రాష్ట్రంలో ఊపందుకున్నాయి. ముఖ్యంగా ఈ మధ్య అధికార పార్టీ ఎమ్మెల్యేలకు తరచూ ఫోన్లు వస్తున్నాయి. రాజీనామా చేస్తేనే తమ ఊరుతో పాటు నియోజకవర్గం కూడా అభివృద్ధి చెందుతుందని కొంతమంది కార్యకర్తలు తమ ఎమ్మెల్యేలకు ఫోన్లు చేస్తున్నారు. దీంతో కొందరు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేస్తుండగా.. మరికొందరు స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా కాల్ కట్ చేస్తున్నారు. తాజాగా కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి కూడా రాజీనామా చేయాలంటూ ఒక ఫోన్ కాల్ వచ్చింది. ఇది ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండలానికి చెందిన టీఆర్ఎస్ నేత సల్వాజి మాధవరావు.. కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి ఫోన్ చేసి రాజీనామా చేయాలని కోరాడు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కాల్ చేసి రాజీనామా చేయాలనడం పద్ధతేనా..? దీన్ని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో వైరల్ చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీగా ఉండి ఏం ప్రయోజనం లేదని, వెంటనే రాజీనామా చేయాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని కోరాడు. మాధవరావు ప్రశ్నలకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి.. కూల్‌గా సమాధానం చెప్పేందుకు ప్రయత్నించారు. తాను ఎమ్మెల్సీ పదవికి రాజీనామా ఎందుకు చేయాలని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. రాజీనామా చేస్తేనే విద్యావంతుల సమస్యలు పరిష్కారమవుతాయని మాధవరావు బదులిచ్చాడు. మంత్రి కొప్పుల ఈశ్వర్ కు మాధవరావు అనుచరునిగా కొనసాగుతున్నారని తెలుస్తోంది.






## 12న రామగుండం వస్తున్న ప్రధాని మోడీ

### సభ ఏర్పాట్లపై జిల్లా నేతలతో చర్చించిన బండి

**హైదరాబాద్,నవంబరు 5(ప్రజామంటలు):** బీజేపీకార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లా నేతలతో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కీలక సమావేశం నిర్వహించారు. ఈనెల 12న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన ఏర్పాట్లపై చర్చించిరట్లు తెలుస్తోంది. ఆర్ఎఫ్‌సీఎల్‌ను జాతికి అకింతం చేసేందుకు మోదీ రామగుండం వస్తున్నారు. ఈ నేపథ్యంలో భారీ బహిరంగ ఏర్పాటుకు బీజేపీ సన్నాహాలు చేస్తోంది. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల నేతలతో బండి సంజయ్ చర్చించారు. ఈ నెల 12వ తేదీన రాష్ట్రంలో ప్రధాని నరేంద్రమోడీ పర్యటన ఉన్న నేపథ్యంలో ఏర్పాట్లపై పార్టీ ముఖ్య నేతలతో చర్చించారు. రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)ను జాతికి అంకితం చేసేందుకు మోడీ రామగుండానిక రానున్నారు. ఈ క్రమంలో అక్కడ భారీ బహిరంగ సభ ఏర్పాటుకు బీజేపీ సన్నాహాలు చేస్తోంది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఈటల రాజేందర్, జాతీయ కార్యవర్గ సభ్యులు జీ. వివేక్ వెంకటస్వామితో పాటు జిల్లా అధ్యక్షులు, ముఖ్యనేతలు పాల్గొన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ ను నవంబర్ 12వ తేదీన ప్రధాని మోడీ జాతికి అంకితం చేయనున్నారు. గతంలో మూతబడిన రామగుండం ఎఫ్‌సీఐ పునరుద్ధరణకు కేంద్రం చర్యలు తీసుకుంది. మొత్తం రూ. 6,120 కోట్లతో కేంద్ర ప్రభుత్వం రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని పునర్నిర్మాణం చేసింది. మోడీ పర్యటన నేపథ్యంలో ఆర్ఎఫ్ సిఎల్ ను కేంద్ర ఎరువుల, రసాయన శాఖ కార్యదర్శి అరుణ్ సింఘాల్ ఇటీవలే సందర్శించారు.

## రైతాంగాన్ని మోసం చేస్తున్న మోడీ

### రైతు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎర్రబెల్లి

**మహబూబాబాద్,నవంబర్5:** రైతాంగాన్ని మోసం చేస్తున్నది ప్రధాని నరేంద్ర మోదీనే అని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మండిపడ్డారు. రైతులు లాభ పడాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ముందుకు వెళ్తున్నారని మంత్రి స్పష్టం చేశారు. పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలం ఖానాపూర్ గ్రామంలో ప్రాథమిక రైతు సేవా సహకార సంస్థ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దయాకర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై కక్ష కట్టిందని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ పరిపాలనతో అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి చెందిందని చెప్పారు. రైతుబంధు, రైతుబీమా పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ప్రతి ఎకరానికి నీళ్లు అందించిన మహాత్ముడు సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. సాగు నీరు, 24 గంటల కరెంట్, రైతు బంధు లాంటి పథకాల అమలు వల్ల పంటలు బాగా పండిస్తున్నారు.



దిగుబడి కూడా పెరిగిందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను మన ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నదని తెలిపారు. పక్క రాష్ట్రాల రైతులు మన రాష్ట్రంలో పుట్టనందుకు బాధ పడుతున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సమస్యలు వస్తే వెంటనే వాటిని పరిష్కరించాలని సూచించారు.

## 26న దేశవ్యాప్తంగా ఛలో రాజ్‌భవన్

### రైతు సమస్యలపై పోస్టర్ విడుదల

**హైదరాబాద్,నవంబర్5:** కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం రైతాంగానికి రాత పూర్వకంగా ఇచ్చిన హామీల అమలు కోసం ఈనెల 26న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఛలో రాజ్‌భవన్ కు రైతులు భారీగా తరలిరావాలని అఖిలభారత రైతు పోరాట సమన్వయ కమిటీ, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఛలో రాజ్‌భవన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు సాగర్, పశ్యపద్మ, ఉపేందర్‌రెడ్డి మండల వెంకన్న మాట్లాడుతూ చారిత్రక రైతు పోరాటానికి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర గవర్నర్లకు సమస్యలతో కూడిన మెమోరాండాలను అందిస్తామన్నారు. నాడు రైతు ఆందోళనకు స్పందించిన ప్రధాని రైతులకు క్షమాపణ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. రైతులకిచ్చిన హామీలను అమలు కోరుతూ దేశవ్యాప్తంగా ఉన్న రాజ్‌భవన్‌ల ఎదుట ఆందోళనలు, వినతిపత్రాల సమర్పణ చేపట్టనున్నామని పేర్కొన్నారు. రైతాంగం పండించిన పంటలకు కనీస మద్దతు ధరల కోసం పార్లమెంటులో చట్టం చేయాలని, స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం సీ 2050 అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి ఉన్న రుణాలన్నింటినీ ఏకకాలంలో మాఫీ చేయాలని, రుణ విమోచన చట్టం తేవాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించు కోవాలని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సవరించి అమలు చేయాలని కోరారు. రైతు ఉద్యమంలో మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని, రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## ఖతర్ జైలు నుంచి ఇంటికి చేరిన మహిళలు

### ఎమ్మెల్సీ కవిత చొరవతో లైన్ క్లీయర్

**నిజామాబాద్,నవంబర్5(ప్రజామంటలు):** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి గొప్ప మనసును చాటుకున్నారు. ఏ నేరం చేయకుండా ఖతర్ జైలులో ఉన్న నిజామాబాద్‌కు చెందిన ఇద్దరు మహిళలను క్షేమంగా ఇంటికి చేర్పించి కుటుంబ సభ్యుల కన్నీళ్లను దూరం చేశారు. నగరానికి చెందిన ఆసియా బేగం, షేక్ నసీమాలు పదినెలల కిందట బతుకుదేరువు కోసం ఖతర్ దేశానికి వెళ్లారు. అక్కడ ఓ ఇంట్లో పనిలో చేరారు. వారు జీతం సరిగ్గా ఇవ్వకపోగా వారిని కొట్టడం, తిట్టడం లాంటి వేధింపులకు గురిచేశారు. దీంతో బాధితులిద్దరూ అక్కడి నుంచి పారిపోతూ పోలీసులకు చిక్కడంతో జైలులో వేశారు. ఈ విషయం బంధువుల ద్వారా జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారికి తెలియడంతో పూర్తి వివరాలు సేకరించి ఎమ్మెల్సీ కవితకు విషయాన్ని చెప్పారు. వెంటనే స్పందించిన కవిత ఖతర్‌లోని జాగృతి అధ్యక్షులు నందిని అబ్బగౌనికి సమాచారం అందించారు. ఆమె జైలుకు వెళ్లి బాధితులను, అధికారులతో సంప్రదింపులు జరిపి పదిరోజుల్లో ఆమెను జైలు నుంచి బయటకు విడుదల చేయించారు. అనంతరం వారిని స్వదేశానికి పంపించేందుకు గాను ఎంబసీ అధికారులతో మాట్లాడి విమాన టికెట్లను ఏర్పాట్లు చేయడంతో బాధితులిద్దరూ క్షేమంగా ఇంటికి చేరుకున్నారు. నిజామాబాద్‌కు చేరుకున్న బాధిత మహిళలను శనివారం జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, జాగృతి జిల్లా అధ్యక్షుడు అవంతి కుమార్, రాష్ట్ర కార్యదర్శి నరాల సుధాకర్, యూత్ జిల్లా అధ్యక్షులు రెహాన్ తదితరులు పరామర్శించారు. తమను క్షేమంగా ఇంటికి చేర్పించిన ఎమ్మెల్సీ కవితకు, ఖతర్ జాగృతి అధ్యక్షురాలు నందినికి జీవితాంతం రుణపడి ఉంటామని బాధితులు తెలిపారు.

# సప్త ఖండాల మహిళా పృచ్ఛకులతో ఆవధానం

## అంతర్జాల వేదికగా త్రిభాషా మహా సహస్రావధానం - వద్దిపర్తి వారి 13వ శతావధానం ఘనవిజయం

**హైదరాబాద్ నవంబర్ 05 (ప్రజా మంటలు):** "సప్తఖండ అవధాన సాహితీ ఝరి - త్రయోదశ శతావధానం - అష్టోత్తర శత మహిళా పృచ్ఛకురాండ్రతో సరస్వతీ సమర్చనం" అనే అపూర్వ శతావధాన కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా అన్ని ఖండాల నుండి 108 మంది మహిళా శిరోమణులు పాల్గొన్న "సప్త ఖండ అవధాన సార్వభౌమ" బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ శ్రీ ప్రణవ పీఠం, ఏలూరు వేదికగా అత్యద్భుతంగా నిర్వహించారు.



త్రిభాషామహాసహస్రావధాని, అభినవశుక బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురుదేవుల త్రయోదశ శతావధాన ప్రారంభం సంచాలకులు "సహస్రావధాని" శ్రీ కోట వేంకట లక్ష్మీ నరసింహం గారు




విజయోత్సవప్రసంగం: భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి వర్యులు, శ్రీయుతులు శ్రీమాన్ ముప్పవరపు శ్రీ వెంకయ్య నాయుడుగారు

ప్రారంభోత్సవ సభలో మధ్యప్రదేశ్ బీజేపీ రాష్ట్ర ఇంచార్జ్, మాజీ అఖిలభారత బీజేపీ ప్రధాన కార్యదర్శి పోల్సాని మురళీధర రావు గారు హాజరై సభను ప్రారంభించారు.

ఈ శతావధానం రెండున్నర రోజులు జరిగింది. ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ తెలుగు సంస్థలు: ఆస్ట్రేలియా ఖండం (ఆస్ట్రేలియా), ఆసియా ఖండం ( మలేసియా, భారతదేశం, సింగపూర్, మలేషియా, ఖతార్ తెలుగు సంఘం , ఐరోపా ఖండం (యునైటెడ్ కింగ్ డమ్, లండన్), ఉత్తర అమెరికా ఖండం (యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, కెనడా), ఆఫ్రికా (దక్షిణ ఆఫ్రికా), దక్షిణ అమెరికా (కొలంబియా) ల నుండి 108 మంది మహిళలు పాల్గొన్నారు. 78 సమస్యలు, 33 ఆశువులు, నలుగురి అప్రస్తుత ప్రసంగాలతో సభ విరాజిల్లింది. మూడవ రోజు ఉదయం అత్యద్భుతంగా జరిగిన ధారణ సభ నయనానందకరంగా ఒక పండుగ వాతావరణాన్ని తలపించింది. ప్రత్యక్షంగానూ, అంతర్జాలం లోనూ తిలకిస్తున్న సాహితీప్రియులు అచ్చెరువొందేలా భాషా ప్రేమికులు విస్మయం చెందేలా "అవధాన కళా మౌళి", బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు తాము గత రెండు రోజుల్లో పూరణ చేసిన 78 సమస్యలని కేవలం 55 నిమిషాల్లో ఆశ్చర్యకరంగా ధారణ చేసారు. మహాధారణ అయిన తరువాత కూడా మరొక సమస్య తీసుకుని ద్రుపూరణ చేయడం అసాధారణం. ఈ అవధానంలో అన్నీ సమస్యాంశాలను తీసుకోవడం కూడా మరొక నూతనప్రయోగం. ప్రణవ పీఠం స్వచ్ఛంద కార్య నిర్వాహకురాలు అమెరికా టెక్సాస్ నుండి శ్రీమతి కృష్ణ పద్మ తెలియచేసారు. అనంతరం జరిగిన విజయోత్సవ సభలో భారతదేశం పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలుగు భాషలో ప్రత్యేకమైన ప్రక్రియగా అవధానానికి ఉన్న స్థానం సుస్థిరమని తెలిపారు. అచ్చంగా మహిళా పృచ్ఛకురాండ్రతో అవధాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అతిథిగా డాక్టర్ కోలవెన్ను మలయవాసిని, డాక్టర్ శారదా పూర్ణ సుసర్ల శొంఠి, బులుసు అపర్ణ, మా శర్మ, డాక్టర్ సుహాసిని ఆనంద్ కొమరగిరి, పాలడుగు శ్రీచరణ్ తో పాటు ప్రపంచంలో ఏడు ఖండాల నుంచి తెలుగు భాషాభిమానులు, పలు తెలుగు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన అంతర్జాతీయ తెలుగు సంస్థలకు శ్రీమతి కృష్ణ పద్మ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఉత్తర అమెరికా ఖండం - తెలుగు తల్లి కెనడా - లక్ష్మి రాయవరపుబీ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా - యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, ప్రణవ పీఠం నుంచి శ్రీ రావు తల్లాప్రగడ, ఆసియా ఖండం - మలేషియా తెలుగు సంఘం - డా. వెంకట ప్రతాప్, సత్య మల్లుల, ఆఫ్రికా ఖండం - దక్షిణ ఆఫ్రికా సాహిత్య వేదిక - శ్రీ రాపోలు సీతారామరాజు, అవధానిగా, కవిగా, సంగీతవేత్తగా, పౌరాణికులుగా, ప్రవచనకర్తగా, శ్రీ ప్రణవపీఠ స్థాపకులుగా, త్రిభాషా కోవిదులుగా అవధాన ఋషిమండలంలో విశిష్ట స్థానాన్ని పొందిన వశిష్టులు వద్దిపర్తి వారని అందరూ కొనియాడారు. అందరూ మహిళా పృచ్ఛకులుగా ఇంత పెద్ద స్థాయిలో 'శతావధానం' నిర్వహించడం ఘనతరమైన సారస్వత సాహసం. ఇది ముందెన్నడూ జరగని అపురూప దృశ్యం.

## తొలి ఓటరు శ్యామ్‌చరణ్ నేగి కన్నుమూత

- వృద్ధాప్య సమస్యలతో సొంతూరులో కన్నుమూత

**సిమ్లా,నవంబర్5(ప్రజామంటలు):** స్వతంత్ర భారత తొలి ఓటరు శ్యామ్ శరణ్ నేగి (106) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఈ రోజు తెల్లవారుజామున తన స్వగ్రామంలో తుదిశ్వాస విడిచారు. శ్యామ్ నేగి .. హిమాచల్ ప్రదేశ్‌లోని కిన్నౌర్ లో జులై 1, 1917న జన్మించారు. 1951 సాధరణ ఎన్నికల్లో ఆయన ఓటు వేశారు. అప్పటినుంచి ప్రతిసారి తన ఓటు హక్కును వినియోగించుకుంటూ వస్తున్నారు. ఈ నెల 12న రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల కోసం ఆరోగ్యం సహకరించకపోవడంతో రెండు రోజులు క్రితం పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

శ్యామ్ నేగి అంత్యక్రియలకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోందని, ఆయనకు గౌరవప్రదంగా వీడ్కోలు పలికేందుకు బ్యాండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కిన్నౌర్ అబిద్ హుస్సేన్ తెలిపారు. శ్యామ్ నేగి కల్పాలో పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆయన హిందీ చిత్రం సనమ్ రేలో కూడా ప్రత్యేక పాత్రలో కనిపించారు. 2014లో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం యువ ఓటర్లలో ఎన్నికల వ్యవస్థలో పాల్గొనేలా అవగాహన కల్పించేందుకు ఆయనను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. శ్యామ్ నేగి మృతి పట్ల హిమాచల్ ప్రదేశ్ సీఎం జైరాం ఠాకూర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణవార్తను వినడం



బాధాకరంగా ఉందని అని సీఎం ట్వీట్ చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మొత్తం 68 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 12న ఒకే దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. డిసెంబర్ 8న ఓట్ల లెక్కింపు జరగనుంది.

## తెలంగాణ సంపదను పెంచిన కెసిఆర్

- సంక్షేమమే లక్ష్యంగా పాలన గంగుల

**కరీంనగర్,నవంబరు 5(ప్రజామంటలు):** రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని పెంచి, వచ్చిన సంపదను పేదలకు పంచాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాక నాణ్యమైన ఉచిత విద్యుత్, సాగునీరు, రైతుబంధుతోపాటు అనేక గొప్ప పథకాలు కేసీఆర్ అమలు చేస్తున్నారని అన్నారు. గతంలో ఏ రాష్ట్ర ప్రభుత్వనీ నిరుపేదింటి ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలవాలనే ఆలోచన రాలేదన్నారు. స్వయంపాలన లో కేసీఆర్ అన్నగా, మేనమామగా నిరుపేద ఇంటి ఆడబిడ్డలకు అండగా ఉంటానని కల్యాణ లక్ష్మి , షాదీముబారక్ పథకాన్ని చేపట్టారన్నారు. శనివారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో కరీంనగర్ అర్బన్, కొత్తపల్లి మండలాలకు చెందిన 142 మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు రూ. కోటి 42 లక్షల 16,472 లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద ఆడబిడ్డ పెళ్లయిన నెల రోజుల్లోనే చెక్కులు అందిస్తున్నామని పేర్కొన్నారు. కేసీఆర్ కిట్ తో ఉచితంగా కాన్పులు, ఉన్నత వర్గాలకు ధీటుగా మహాత్మా జ్యోతిబాపూలే గురుకులాల్లో ప్రతి విద్యార్థికి సంవత్సరానికిరూ. 1. 25 లక్షలు వెచ్చించి నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్ కుమార్, ఎంపీపీలు తిప్పర్తి లక్ష్మయ్య, పిల్లి శ్రీలత,



కొత్తపెల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, జడ్పీటీసీలు,కార్పొరేటర్లు, సర్పంచులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## కమాండ్ కంట్రోల్ సెంటర్ ముట్టడికి పిలుపు

- ఎక్కడిక్కడే బిజెపి నేతలను అడ్డుకున్న పోలీసులు

**హైదరాబాద్,నవంబర్5:** కమాండ్ కంట్రోల్ సెంటర్ ముట్టడికి బీజేపీ పిలుపునివ్వడంతో అక్కడ ఉద్రిక్తంగా మారింది. దీంతో అక్కడ పోలీసులు భారీగా మెహరించారు. ఉదయం నుంచే బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు హౌస్ అరెస్టు చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ దగ్గర భారీగా మోహరించిన పోలీసులు కంట్రోల్ సెంటర్‌కి వచ్చే మార్గాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో బీజేపీ నేతలు, కార్యకర్తల అక్రమ అరెస్టులు.. బీజేపీ నేతలపై టీఆర్ఎస్ దాడులను నిరసిస్తూ ముట్టడికి పిలుపునిచ్చారు. పోలీసులు కూడా టిఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ముట్టడి సందర్భంగా బీజేపీ నేతల అరెస్టులు కొనసాగాయి. ఉదయం నుంచే బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు హౌస్ అరెస్టు చేస్తున్నారు. కంట్రోల్ సెంటర్ కి వచ్చే మార్గాల్లో పోలీసులు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 12 కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామిని పోలీసులు అడ్డుకున్నారు. రామగుండంలో మోడీ టూర్ ఏర్పాట్లకు వెళ్తున్నానని చెప్పినా వినకుండా.. పోలీసులు వివేక్ వెంకటస్వామితో వాగ్వాదానికి దిగారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ మేయర్ బండ కార్తీకలను అరెస్ట్ చేసి పీఎస్ కు తరలించారు పోలీసులు. రాష్ట్రలో బీజేపీ నేతలు, కార్యకర్తల అక్రమ అరెస్టులు.. బీజేపీ నేతలపై టీఆర్ఎస్ దాడులను నిరసిస్తూ ముట్టడికి పిలుపునిచ్చారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ దగ్గర భారీగా పోలీసులు మోహరించారు .

## డ్రగ్స్ కేసులో కీలక సూత్రధారి ఎడ్విన్ అరెస్ట్

**హైదరాబాద్,నవంబరు 5(ప్రజామంటలు):** డ్రగ్స్ కేసులో కీలక సూత్రధారి ఎడ్విన్‌ని నార్కోటిక్ పోలీసులుశనివారం అరెస్ట్ చేశారు. ఎడ్విన్ దేశవ్యాప్తంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల నారాయణ బోర్కర్‌ను కూడా నార్కోటిక్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. గోవా నుంచి డ్రగ్స్ తీసుకొని హైదరాబాద్?కు సరఫరా చేస్తుండగా నారాయణ బోర్కర్ పోలీసులకు చిక్కాడు. ఇప్పుడు నారాయణ బోర్కర్ ఇచ్చిన సమాచారం ఆధారంగా గోవాలో పలువురుపై నార్కోటిక్ విభాగం పోలీసులు నిఘా పెట్టారు. గత మూడు నెలలుగా తప్పించుకు తిరుగుతున్నఎడ్విన్?ను ఎట్టకేలకు పట్టుకున్నారు. ఈ రోజు రాత్రి పోలీసులు ఎడ్విన్ హైదరాబాద్?కు తీసుకురానున్నట్లు సమాచారం.



## ప్రగతిభవన్‌కే పరిమితం అయిన ఆ నలుగురు

### వారు బయటకు రాకుండా జాగ్రత్తలు

**హైదరాబాద్,నవంబర్5(ప్రజామంటలు):** మొయినాబాద్ ఫాంహౌస్ ఘటన తర్వాత నుంచి నలుగురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రగతిభవన్ కే పరిమితమయ్యారు. తమ తమ నియోజకవర్గాలకు వెళ్లకుండా 11 రోజులుగా ప్రగతిభవన్ లో ఎమ్మెల్యేలు ఉండడంపై చర్చనీయాంశంగా మారింది. తాండూరు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుకు మంత్రులతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం సెక్యూరిటీని పెంచింది.

ఉప ఎన్నిక సందర్భంగా ప్రచారం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ గత నెల 30వ తేదీన మునుగోడుకు వెళ్లారు. ఆ సమయంలో తన వెంటహెలికాప్టర్ లో నలుగురు ఎమ్మెల్యేలను వెంట తీసుకెళ్లారు. ఆ సభ తర్వాత మళ్లీ నలుగురు ఎమ్మెల్యేలు సీఎం కేసీఆర్ తో ప్రగతిభవన్ కే వెళ్లారు. తమ నియోజకవర్గాలకు వెళ్లలేదు. ఈనెల 3వ తేదీన ప్రగతిభవన్ లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో నలుగురు ఎమ్మెల్యేలు.. ముఖ్యమంత్రి కేసీఆర్ పక్కనే కనిపించారు.

## పలు రాష్ట్రాలో ఉప ఎన్నికలు

### 5న పోలింగ్,8న ఫలితాలు:ఇసి

**న్యూఢిల్లీ,నవంబర్5(ప్రజామంటలు):** ఒడిశా, రాజస్థాన్, బీహార్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రలలో జరగనున్న ఉప ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ షెడ్యూల్ ప్రకటించింది. డిసెంబర్ 5 న పోలింగ్, 8 న ఫలితాలు వెలువడనున్నాయి. ఈసీ నోటిఫికేషన్ ప్రకారం డిసెంబర్ 8న గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. నవంబర్ 10 నుండి 17వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేయవచ్చు. నవంబర్ 18 నామినేషన్ల పరిశీలన, నవంబర్ 21న అభ్యర్థుల ఉపసంహరణకు చివరి తేదీ అని ఈసీ వెల్లడించింది. డిశాలోని పదంపూర్, రాజస్థాన్‌లోని సర్దార్‌షహర్, బీహార్‌లోని కుర్హానీ, ఛత్తీస్‌గఢ్‌లోని భానుప్రతాపూర్, ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్ అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి పార్లమెంట్ స్థానానికి కూడా డిసెంబర్ 5నే పోలింగ్ జరగనుంది. ఇప్పటికే హిమాచల్, గుజరాత్ రాష్ట్రాల ఎన్నికకు ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది.

## బీదర్‌లో ఘోరరోడ్డు ప్రమాదం

### ట్రక్కు,ఆటో ఢీకొనడంతో ఏడుగురు దుర్మరణం

**బెంగళూరు,నవంబర్5(ప్రజామంటలు):** కర్ణాటకలోని బీదర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రక్కు, ఆటో రిక్షా ఢీ కొట్టుకొవడంతో ఏడుగురు మహిళలు అక్కడిక్కక్కడే మృతిచెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా బుడమనహళ్లి గ్రామానికి చెందిన కూలీలు. పని ముగించుకుని తమ ఇండ్లకు తిరిగి వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని వెంటనే బీదర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో రెండు వాహనాల డ్రైవర్లు కూడా ఉన్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై బెమల్‌ఖేడా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## టీఎస్ ఎడ్‌సెట్ మొదటి విడుత సీట్ల కేటాయింపు

**హైదరాబాద్,నవంబర్5(ప్రజామంటలు):** టీఎస్ ఎడ్‌సెట్ 2022 మొదటి విడుత సీట్ల కేటాయింపు జరిగింది. ఈ మేరకు టీఎస్ ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రకటన విడుదల చేశారు. తొలి విడుతలో 16,664 మంది అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు ఇవ్వగా, 10,053 సీట్లు కేటాయించారు. కన్వీనర్ కోటాలో మొత్తం సీట్లు 14,285. కాగా 4,232 సీట్లు మిగిలాయి. అయితే తొలి విడుతలో సీట్లు పొందిన అభ్యర్థులు.. జాయినింగ్ లెటర్, చలాన్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని



అధికారులు సూచించారు. ట్యూషన్ ఫీజు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చెల్లించాలని చెప్పారు. ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు చలాన్, జాయినింగ్ రిపోర్టు తీసుకొని సంబంధిత కాలేజీల్లో ఈ నెల 5 నుంచి 11వ తేదీ లోపు సమర్పించాలని సూచించారు. నవంబర్ 14 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే, జెడ్పీ చైర్ పర్సన్

**జగిత్యాల నవంబర్ 05 (ప్రజామంటలు):** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్వర్యంలో చలిగల్ వ్యవసాయ మార్కెట్ లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం



ప్రారంభించిన న జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత. అనంతరం చల్ గల్ గ్రామంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన 50 వేల రూపాయల విలువగల చెక్కులను లబ్దిదారులకు అందజేసిన ఎమ్మెల్యే, జెడ్పీ చైర్ పర్సన్. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నక్కల రాధ, సర్పంచ్ ఎల్ల గంగనర్సు రాజన్న,రైతు బందు సమితి కన్వీనర్ నక్కల రవీందర్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ అసిఫ్,ఉప సర్పంచ్ పద్మ తిరుపతి, డిసిఓ రామాంజనేయులు, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్, సిఈఓ వేణు, పాక్స్, ఏఎం సి డైరెక్టర్లు, అధికారులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఆర్మీ జవాన్ పిట్టల రాజు గుండెపోటుతో మృతి

### ముల్కనూర్‌లో విషాదం



**భీమదేవరపల్లి నవంబర్ 05 (ప్రజామంటలు):** మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ పిట్టల రాజు శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. రాజు ఆర్మీ నుండి రిటైర్ అయినప్పటి నుండి మంచిర్యాలలో నివసిస్తున్నారు. వారి మృతి పట్ల సర్పంచ్ మాడుగుల ప్రెస్ కొమురయ్య, జెడ్పిటిసి వంగ రవి, ఎంపీటీసీలు అప్పని పద్మ, బొల్లంపల్లి రమేష్, గ్రామస్థులు సంతాపం వ్యక్తం చేశారు. దేవుడు ఆ కుటుంబానికి మనోధైర్యం ప్రసాదించాలని కోరుకున్నారు.

### రోడ్డు విస్తరణలో నష్టపోతున్న ఇండ్లకు, భూములకు

## నష్ట పరిహారం చెల్లించాలి

### ఎన్ఈ ఆర్ అండ్ బి అధికారికి వినతిపత్రం


**భీమదేవరపల్లి నవంబర్ 05 (ప్రజామంటలు):** మండలంలోని గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ప్రజల ఇండ్లు, భూములు రోడ్డు విస్తరణలో నష్టపోతున్నందున



నష్టపరిహారం చెల్లించాలని హనుమకొండ ఎస్ఈ ఆర్ అండ్ బి అధికారికి గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గట్ల నర్సింగాపూర్ నుండి కొత్తకొండ వరకు వేస్తున్న రోడ్డు విస్తీర్ణంలో పోతున్న ఇండ్లు, భూములకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వడం లేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. కనీసం సమాచారం ఇవ్వకుండా రోడ్డు పనులు ప్రారంభిస్తున్నారని అన్నారు. పూర్తిగా దర్యాప్తు చేసి తరువాత చట్టపరమైన నష్టపరిహారం చెల్లించాలని వారు కోరారు. నష్టపరిహారం ఇచ్చేవరకు రోడ్డు విస్తరణ నిలిపివేయాలని కోరారు. రోడ్డు విస్తీర్ణం గ్రామంలో 25 ఫీట్లు ఉండేలాగా చూడాలన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్న రైతులు

**ఎల్కాతుర్తి నవంబర్ 05 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఐకెపి సెంటర్లు ఏర్పాటు చేయకపోవడంపై ఇబ్బంది పడుతున్న రైతులు ఇప్పటికీ వరి



కోతలు ఏర్పాటు చేసి 20 రోజులు జరిగిన కూడా ప్రభుత్వం స్పందించకపోవడం పై ఇబ్బందులు పడుతూ రైతులు రోడ్లపై వడ్లు పోయగా, కోతుల వలన పందుల వలన ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సెంటర్లు ఓపెన్ చేసి రైతులను ఆదుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



హుజూరాబాద్ మండలం కాట్రపల్లిలో మన ఊరు మనబడి కార్యక్రమాన్ని పరిశీలించిన ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు.

## ప్రజల ప్రాణాలతో పాలకుల చెలగాటం

- బుగ్గారం వాసుల ఆవేదన
- తొంగి చూసి, పట్టించుకోకుండా పోయిన ప్రజాప్రతినిధులు
- బుగ్గారం బస్టాండ్ లో ప్రజలకు ఇబ్బందులు
- వాహనాల రాకపోకలకు అంతరాయం

**బుగ్గారం నవంబర్ 05 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా బుగ్గారం ప్రజా సమస్యలు తీర్చాల్సిన పాలకులే ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని బుగ్గారం గ్రామస్తులు



ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక బస్టాండ్ లో బుగ్గారం గ్రామస్తులు, ఆటో కార్మికులు విలేకరులతో మాట్లాడారు. జగిత్యాల జిల్లాలో నూతనంగా ఏర్పడ్డ మా బుగ్గారం మండల కేంద్రంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపించారు. మండల కేంద్రమని నూతనంగా నిర్మించిన డబల్ రోడ్డుకు ఇరుప్రక్కల మురికాలువలు నిర్మించలేదన్నారు. ఇటీవల కురిసిన అధిక వర్షాల పేరుతో స్థానిక పాలకులు, నాయకులు, ప్రజాప్రతినిధులు రోడ్డుకు ఇరువైపులా అడ్డదిడ్డంగా అవసరానికి మించి జేసిబిలతో లోతైన కాలువలు త్రవ్వారని ఆరోపించారు. త్రవ్విన మట్టి, బండరాళ్లు, పాత డ్రైనేజి సిమెంట్ - కంకర శిథిలాలు అన్నీ కూడా రోడ్డు మీదనే వేశారని, వాటితో రోడ్డు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయన్నారు. ఇప్పటికే పలు వాహనదారులు ప్రమాదానికి గురయ్యారని తెలిపారు. బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణీకులు కనీసం బస్సు ఎక్కే అవకాశం, దిగే అవకాశం కూడా సరిగా లేక నరకయాతన పడాల్సి వస్తోందన్నారు. గత నాలుగు నెలలుగా ప్రజలు, ప్రయాణీకులు అనేక ఇబ్బందులు పడుతున్నా గానీ ప్రజాప్రతినిధులు, పాలకులు, అధికార పార్టీ నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు. బస్టాండ్ లో ఆటోలు నిలిపే స్థలం కూడా లేక సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆటో కార్మికులు ఆరోపించారు. శనివారం బాధిత బుగ్గారం గ్రామస్తులు, ఆటో కార్మికులు విలేఖరులతో మాట్లాడుతుండగా స్థానిక సర్పంచ్ భర్త మూల శ్రీనివాస్ గౌడ్, అధికార టిఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పొన్నం సత్తయ్య లతో పాటు యావత్ బుగ్గారం మండలానికే బాస్ గా పిలువబడే స్థానిక జడ్పిటిసి బాదినేని రాజేందర్ లు అక్కడినుండే వెళుతూ ఆగి సమస్యను కూడా వీక్షించారు. కానీ అక్కడున్న బాధిత ప్రజలతో సమస్య గురించి తెలుసుకోకుండా, చర్చించకుండా, అస్సలైన ప్రజాసమస్య గురించి పట్టించుకోకుండా వెళ్లిపోవడం పలు అనుమానాలకు, విమర్శలకు దారి తీస్తోంది. ఇకనైనా








నాయకులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు కనువిప్పు కలిగి ప్రజా సమస్యలు తొలగించాలని బుగ్గారం గ్రామస్తులు కోరారు. ఆటో కార్మిక సంఘం నాయకులు నగునూరి తిరుపతి, బొద్దుల శివ, కప్పల శంకర్, పెద్దనవేని రెడ్డి రాజన్న, చుక్క శంకర్, మసర్ది మల్లయ్య, నక్క భీమయ్య, బలిజపెల్లి పోచన్న, పెద్దనవేని రాగన్న, నగునూరి చిన్నరామగౌడ్, భారతపు రమేష్, పెద్దనవేని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## భాగవత సప్తాహం 2వ రోజు

**జగిత్యాల నవంబర్ 05 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రానికి సమీపంలోని తాటిపెల్లి గోశాల ప్రాంగణంలో కార్తీక శుద్ధ ఏకాదశి శుక్రవారం ప్రారంభమైన భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞం అద్భుతంగా సాగింది. ప్రముఖ జ్యోతిష్య, వాస్తు, పౌరానిక, వేద పండితులు నంబి వేణు గోపాల ఆచార్య కౌశిక చే ఎంతో అత్యద్భుతంగా నడుస్తున్న ఈ 48 వ భాగవత సప్తాహం వినడానికి వేలాది మంది భక్తులు తరలి రావడం విశేషం ఆచార్యుల వారు ప్రవచనాలు చెబుతూ, మధ్య మధ్య, హాస్య చతురోక్తులు చెబుతూ కడుపుబ్బ నవ్వించడం నిజమైన ఆనందం కలిగిస్తుంది. పాండవ వనవాస ఘట్టం కళ్ళకు కట్టినట్లు చెప్పారు. ఒక వైపు హోమం, మరోవైపు గోపూజ, మరోవైపు సాలగ్రామ, దీప





దానాలు చేస్తూ మహిళలు సందడిగా కనిపించారు. నిర్వాహకులు 2పూటల భక్తులకు ఉదయం అల్పాహారం, సాయంత్రం భోజనం పాకెట్లు అందిస్తున్నారు. ఈనాటికార్యక్రమంలో ఆచార్యులతో బాటు కరీంనగర్ కు చెందిన వాస్తు, జ్యోతిష్య పండితులు నమిలికొండ రమణాచార్యులు, గీతా సత్సంగ్ కార్యదర్శి పాంపట్టి రవీందర్, గోశాల అధ్యక్షుడు రాజిరెడ్డి, కార్యదర్శి కమలాకర్ రావు, మంచాల జగన్ సామాజిక కార్యకర్త తవుటు రాంచంద్రం, జీడిగే పురుషోత్తం, ప్రముఖ గాయకులు రామ్మోహనరావు, వికాస తరంగిని జమున బృందం, మరియు సత్య సాయి సేవా సమితి సభ్యులు, ప్రముఖులు, వివిధగ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## దేవస్థానంలో 'తులసీ కల్యాణానికి' ఏర్పాట్లు

**ధర్మపురి నవంబర్ 05 (ప్రజా మంటలు):** ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ దేవస్థానం లో ఆదివారం నిర్వహించనున్న తులసీ కళ్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీ మహా విష్ణువు అవతారాలలో ఎనిమిదవది శ్రీకృష్ణావతారం. కార్తీక శుద్ధ ఏకాదశి మొదలు కొని పౌర్ణమి వరకు పంచ పర్వాలలో తులసీ కృష్ణుల వివాహం జరపడం సనాతర సాంప్రదాయం. శ్రీవేణు గోపాల స్వామి ఆలయంలో కార్తీక శుద్ధ చతుర్దశి... వైకుంఠ చతుర్ధశి సాయంత్రం కల్యాణం నిర్వహించడం సాంప్రదాయంగా ఉంది. కృష్ణునితో తులసికి అయ్యే వివాహం వివాహ రుతువును స్వాగతిస్తుంది. వివాహాలకు మాఘాధి పంచకాలు తగినవి. తులసి వివాహ పర్వం కార్తీకంలో వస్తుంది. అంటే వివాహ రుతువుకు తులసి కృష్ణుల కళ్యాణం పురోగామి అన్నమాట. శ్రీకృష్ణ విగ్రహానికి, తులసికి మధ్య అంతర పటంగా ఒకశాలువా పట్టు కుంటారు. తులసి వేళ్ళ వద్ద ఒక చెరుకు ముక్క ఉంచి, పసుపు అద్దిన గుడ్డలు, గాజులు మొదలైన ఆభరణాలను తులసి మొక్కకు కట్టి, పురోహితుడు. మంగళాష్టకాలు చదువుతూ వేదోక్త రీతిలో తంతు నిర్వహించాక తెర ఎత్తి, వివాహం జరిపించడం, ప్రసాదంగా నివేదన పదార్థాలను ప్రసాదంగా పంచడం సనాతన సంప్రదాయ ఆచారం. ఈ కార్యక్ర మంలో తులసి కోటలో పెద్ద ఉసిరిక కొమ్మను ఒకదానిని ఉంచడం ప్రత్యేకం.



తులసితో కలిపి ఉసిరిక కొమ్మను పూజించడం, కాయలలో పూజా సమయాన దీపారాధన చేయడం ఆచారం. ఈ నేపథ్యంలో దేవస్థానం ఎసి, ఇఓ శ్రీనివాస్, దేవస్థానం పునరుద్దరణ కమిటీ చైర్మన్, సభ్యులు, అర్చకులు, సిబ్బంది ఆదివారం సాయంత్రం నిర్వహించనున్న తులసీ కళ్యాణ ఘట్టానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే శ్రీరామ లింగేశ్వరాలయంలో రాత్రి 10 నుండి 12గంటల వరకు మహా రుద్రాభిషేక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

మేము సైతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ లగిశెట్టి అశోక్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్, ఎం.ఆర్.ఓ ఆఫీసు, ఇండస్ట్రియల్ ఏరియాలో యటా క్రాంతి కుమార్ సహాకారంతో దుప్పట్ల పంపిణీ. పాల్గొన్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు తుంగ కౌశిక్, సభ్యులు సన్నీ, వివేక్, రాజు, రాజేష్, పరిషి, రవి, శ్రీకాంత్, రాజశేఖర్.



### పడాల రాహుల్‌ను

## అభినందించిన రాహుల్ గాంధీ

**కరీంనగర్ నవంబర్ 05 (ప్రజామంటలు):** రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, మొబైజేషన్ కమిటీ కో-కన్వీనర్ పడాల రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పడాల రాహుల్ కోవిడ్



కాలంలో చేసిన సేవలకు గాను గతంలో రాహుల్ గాంధీ అభినందించిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ పడాల రాహుల్ చేతిపై ఉన్న పచ్చబొట్టును గురించి ఆసక్తిగా ప్రశ్నించగా, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాలకు సంబంధించిన ఓం, నక్షత్రం, శిలువ రూపాలతో కూడిన పరమేశ్వరుని రూపంతో ఈ పచ్చబొట్టు కనిపిస్తుందని చెప్పడంతో, సర్వ మతాల ఐక్యత కోసం తాను చేసిన ప్రయత్నాన్ని రాహుల్ గాంధీ అభినందించారు.

### ప్రభుత్వ పాఠశాలలోని 21 మంది విద్యార్థులకు వార్షిక పరీక్ష ఫీజు చెల్లించిన హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్

**శంకర్‌పల్లి నవంబర్ 05 (ప్రజామంటలు):** శంకర్ పల్లి మండల పరిధిలో శనివారం హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న 21 మంది విద్యార్థులకు వార్షిక పరీక్ష



ఫీజును దాతల సహకారంతో రూ.2625/- చెక్కు రూపంలో ఇన్ చార్జి ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ కు అందించినట్లు అధ్యక్షుడు మూడే రవి నాయక్ తెలిపారు. విద్యుత్ శాఖ ఎడిఇ దాత పి. పెరుమళ్ల వెంకటలక్ష్మి సహకారంతో 2022 - 2023 విద్యా సంవత్సరానికి వార్షిక పరీక్ష ఫీజు కొరకు ఒక్కొక్క విద్యార్థికి రూ. 125/- రూపాయలు చొప్పున 21 మందికి రూ. 2625/- చెక్కు అందించామన్నారు. ఈ జూన్ నెలలో కూడా విద్యార్థులు, నోటు పుస్తకాలు, పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మణికంఠ, మొగులయ్య, అనుపమ, రాజా, జ్యోతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి ఎర్రబెల్లి, కలెక్టర్

**జనగామ నవంబర్ 5 (ప్రజామంటలు):** జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామంలో ప్రాథమిక రైతు సేవా సహకార సంస్థ (పిఎసిఎస్సీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్మాల గ్రామంలో



ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సి. హెచ్. శివలింగయ్యతో కలిసి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... సొంత స్థలం ఉంటే ఇల్లు నిర్మించుకోవడానికి వారికీ 3లక్షల రూపాయలు ఇవ్వబోతున్నామని, అభయ హస్తం పథకం ద్వారా మహిళలకు 2000 రూపాయలు పెన్షన్ ఇవ్వబోతున్నామని అన్నారు. 12 కోట్ల రూపాయలుతో సింగరాజుపల్లి, నుండి జీడికల్ వరకు డబల్ రోడ్డు మంజూరు చేయడం జరిగిందనీ ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, రెవెన్యూ డివిజనల్ అధికారి మధు మోహన్, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాం రెడ్డి, డిసిఓ కిరణ్ కుమార్, డిసిఎస్ఓ రోజా రాణీ, జడ్పీటిసి, పల్లా భార్గవి సుందర్ రాంరెడ్డి, ఎంపీపి బసవ సావిత్రి, సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, డిఎం. సంధ్యారాణీ, తదితులున్నారు.

### క్రికెటర్ విరాట్ కోహ్లీ పుట్టినరోజు

## ఆసుపత్రిలో బ్రెడ్స్ పంపిణీ

**జనగామ నవంబర్ 05 (ప్రజామంటలు):** భారత క్రికెట్ మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ పుట్టినరోజు సందర్భంగా జనగామ జిల్లా ఆస్పత్రిలో వీరాభిమాని ఉప్పల వినయ్ 50 మందికి బ్రెడ్ పంపిణీ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు జరిపించారు. ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన జనగామ అమ్మ ఫౌండేషన్ ప్రతినిధి సల్ల



మహేష్, చాడ ఆశిశ్ తరుణ్, బబ్లు, కె. పాల్, గణేష్ ను జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజ్ అభినందించారు. భారత క్రికెట్ విరాట్ కోహ్లీ పుట్టిన రోజు సందర్భంగా యువత ఇలా ఆకలితో ఉన్నవారికి చేయితనందిస్తూ ఆకలి తీరుస్తూ అండగా నిలబడుతూ భారతదేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణే లక్ష్యంగా ప్రతి ఒక్కరు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, ప్రజలకు కష్టాల్లో ఉన్న వారికి చేయూతను అందించాలని అండగా నిలబడాలని అదే నిజమైన అభిమానమని, ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేసి జరుపుకోవాలని యువతకు పిలుపునిచ్చారు.

## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

**ఇబ్రహీంపట్నం నవంబర్ 05 (ప్రజామంటలు):** మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీఎస్పీ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన





సదస్సు, డీఎస్పీ మాట్లాడుతూ.... విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలని, సెల్ ఫోన్ వాడకం వల్ల సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డిఎస్పి కి ప్రభుత్వ జూనియర్ కళాశాల బృందం వారు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ్, మెట్ పల్లి సీఐ శీను, ఇబ్రహీంపట్నం ఎస్సై ఉమా సాగర్, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగిన రాగం శెట్టి అరుణ్ సాయి

### ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

**గొల్లపల్లి నవంబర్ 05 (ప్రజామంటలు):** మండలంలోని ఇస్రాజ్ పల్లి గ్రామంలో గత నెల 29న క్రిమిసంహారక మందు సేవించి బలవన్మరణానికి పాల్పడిన రాగం శెట్టి అరుణ్ సాయి (సం.22) అనే యువకుడు పరిస్థితి విషమించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై దత్తాత్రే తెలిపారు. ఎస్సై తెలిపిన కథనం మేరకు మృతుడు హైదరాబాదులో



చదువు పూర్తిచేసి కొంతకాలంగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఉన్నత విద్యాభ్యాసం కోసం నేను అమెరికా వెళ్లాల్నా? నాన్న అంటూ తండ్రిని తరచుగా అడుగుతుండేవాడు. దీంతో తండ్రి అంతా ఆర్థిక సోమత మన దగ్గర లేదని ఇక్కడే ఉండి చదువుకోవాలని కొడుకును హితవు చెప్పాడు దీంతో తీవ్ర మనోవేదనకు గురి అయ్యి అరుణ్ సాయి జీవిత మీద విరక్తి చెంది మేనత్తకు చెందిన పంట చేనులో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు వైద్య చికిత్స నిమిత్తం జగిత్యాల ఓ ప్రైవేట్ ఆసుపత్రి తరలించారు అక్కడి వైద్యులు సూచన మేరకు మెరుగైన పద్యం కోసం హైదరాబాద్ కు తరలించారు అయితే అక్కడ పరిస్థితి విషమించి వారం రోజుల అనంతరం చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఎదిగివచ్చిన కొడుకు పోయిండని తల్లిదండ్రులు దుఃఖానికి అంతులేకుండా పోయింది. మృతుని తండ్రి అంజన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### గోదాము మరియు స్థానిక టవర్ సర్కిల్ లోని 1 షాపు నెలకు అద్దె ఇచ్చుటకు

## టెండర్ కం బహిరంగ వేలంపాట

**జగిత్యాల నవంబర్ 05 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని వాణి నగర్ లోని గల గోదాము మరియు స్థానిక టవర్ సర్కిల్ లోని 1 షాపు నెలకు



అద్దె ఇచ్చుటకు శనివారం టెండర్ కం బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ వేలంపాట రంగు రవి కిషన్ జగిత్యాల డివిజన్ ఇన్స్పెక్టర్ సమక్షంలో ఆలయ ఈవో పీ. వేణుగోపాల్ ఆధ్వర్యంలో బహిరంగ వేల పాట నిర్వహించగా ఈ వేలం పాటలో గోదాముకు నెలకు అద్దె 76,000 రూపాయలకు వేముల సంతోష్ హెచ్చు పాట దారునిగా నిలిచారు. అలాగే జగిత్యాల పట్టణ టవర్ సర్కిల్ వద్ద ఉన్న1 షాపు అద్దెకు నెలకు 21,000 రూపాయలకు లక్ష్మణ్ హెచ్చుపారుదానిగా నిలిచారు. ఈ వేలం పాటలో మున్సిపల్ వైస్ చైర్మన్, స్థానిక కౌన్సిలర్ దేవాదాయ శాఖ డిప్యూటేషన్ సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

### హుజురాబాద్ ప్రాంతానికి చెందిన శాస్త్రవేత్త

# ఆవుల లక్ష్మయ్య కు అరుదైన పురస్కారం

**హుజురాబాద్ నవంబర్ 05 (ప్రజామంటలు):** భారత వైద్య పరిశోధన మండలి (ఐ. సి.ఎం.ఆర్), జాతీయ పోషకాహార సంస్థ(ఎన్.ఐ.ఎన్)సీనియర్ శాస్త్రవేత్త, ప్రజారోగ్యం, పోషకాహార విభాగం అధిపతి డాక్టర్ ఆవుల లక్ష్మయ్య నేషనల్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ ఇండియా ఫెలోషిప్ కు ఎంపికైనారు. హైదరాబాద్ లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సంస్థలో డైరెక్టర్ గ్రేడ్ సైంటిస్ట్ హోదాలో పనిచేస్తున్న డా. ఆవుల లక్ష్మయ్య హుజురాబాద్ ప్రాంతానికి చెందినవాడు కావడం, ఆయన జాతీయ స్థాయి ఫెలోషిప్ కు ఎంపికావడం సంతోషకరం. హుజురాబాద్ కు సమీపంలోని వెన్నంపల్లి-సైదాపూర్ మండలంలోని జాగీర్ పల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబంలో ఆవుల రాజయ్య,వెంకటమ్మ దంపతుల ఆరుగురి సంతానంలో డా.ఆవుల లక్ష్మయ్య పెద్దవాడు. ఈయనకు తమ్ముడు డా. ప్రశాంత్, నలుగురు సోదరీమణులు వున్నారు. వెనె కెపల్లి పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుండి 7 వ తరగతి వరకు, అలాగే సైదాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల లో 8 నుండి పదవతరగతి వరకు చదువుకున్న డా.లక్ష్మయ్య హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తిచేశారు. ఇంటర్ లో ఈయనకు స్వర్గీయ ఎల్.వి.రమణారావు, రవిశంకర్ శుక్లా, ఒంటెల రమణారెడ్డి (గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదవీ విరమణ చేసిన ఒంటెల రమణారెడ్డి ఈయనకు 8 వతరగతి నుండి ఇంటర్ వరకు సహా విద్యార్థి) సహవిద్యార్థులు. (ఇదేప్రభుత్వ జూనియర్ కళాశాలలోమొదటి బ్యాచ్(1969-71) ఇంటర్ చదివిన మరో శాస్త్రవేత్త డా.సి.హెచ్.మోహనరావు సి.సి.ఎం.బి.డైరెక్టర్ గా పనిచేసిన విషయం తెలిసిందే) ఇంటర్ పూర్తయిన తర్వాత డా.ఆవుల లక్ష్మయ్య ఎం.సెట్.లో ర్యాంక్ సాధించి, వరంగల్ లోని కాకతీయ మెడికల్ కాలేజీ లో ఎం.బి.బి.ఎస్. చదివారు. అలాగే ఉస్మానియా యూనివర్సిటీ నుండి పబ్లిక్ హెల్త్ లో పి.జి.డిప్లొమా, త్రివేండ్రం(కేరళ)లోని శ్రీచిత్రోపు పెరుమాళ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుండి పి.జి.డిగ్రీ ని చదివారు. డా.అంబెద్కర్ యూని వర్శిటీ నుండి ఎం.బి.ఏ(హెచ్.ఆర్) రెండు మాస్టర్స్ డిగ్రీలను చదివారు. 1992 లో నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ న్యూట్రిషన్ సంస్థలో మెడికల్ రీసెర్చ్ ఆఫీసర్ గా నియమితులై గత మూడు



దశాబ్దాలుగా పోషకాహారం, వైద్య విజ్ఞానరంగంలో ఆయన చేసిన విశేష సేవలకు గాను డా.లక్ష్మయ్య కు ఈ గుర్తింపు లభించింది. గ్రామీణ మహిళలు, పిల్లల పోషకాహార లోపాలను గుర్తించి, వాటిని సరిచేయడం లో ఆయన చేసిన కృషి విలువైనది. వీటిపై ఆయన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 150 కి పైగా పరిశోధనా పత్రాలను సమర్పించారు. 2010 లో అంతర్జాతీయ ఆరోగ్య రంగ నిపుణిడిగా డా.లక్ష్మయ్య ను కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం పరిశోధన సలహా బోర్డ్ ప్రకటించింది. నేషనల్ న్యూట్రిషన్ మానిటరింగ్ బ్యూరో ఆఫీసర్ ఇంచార్జి గా ఆయన పనిచేశారు. 2020 లో వైద్య బోధనా రంగంలో సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ ను ఇంపీరియల్ కాలేజి లండన్ ప్రకటించింది. డా.లక్ష్మయ్య సతీమణి రమాదేవి కూడా డాక్టర్. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె హారిక, అల్లుడు అంబరీష్ ఇద్దరు పిల్లల డాక్టర్లు కాగా, చిన్న కుమార్తె అమెరికాలోని గ్లోబల్ ఫార్మా కంపెనీలో క్లినికల్ రీసెర్చ్ విభాగంలో డాక్టర్ గా పనిచేస్తుంది. డా.లక్ష్మయ్య నలుగురు సోదరీమణులు. వీరిలో పెద్ద సోదరికి బాల్యంలోనే వివాహం జరుగగా, ఇంకోసోదరి కూడా డాక్టర్ గా పనిచేస్తుంది. మరో ఇద్దరు చెల్లెల్లు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. హుజురాబాద్ మండలంలోని పెద్దపాపయ్యపల్లి హైస్కూల్లో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న పద్మశ్రీ (ప్రముఖ న్యాయవాది ముక్కెర రాజు గారి సహచరి) డా.లక్ష్మయ్య సోదరీమణులలో ఒకరు. హుజురాబాద్ ప్రాంతానికి చెందిన డాక్టర్ ఆవుల లక్ష్మయ్య జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన శాస్త్రవేత్తగా కొనసాగుతూ, ఎన్. ఏ.ఎస్.ఐ. ఫెలోషిప్ కు ఎంపిక కావడం మనందరికీ గర్వకారణం. రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకం. ఆయన మరిన్ని పురస్కారాలను పొంది హుజురాబాద్ ప్రాంత కీర్తి ప్రతిష్టలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెంపొందించాలని ఆశిద్దాం.

డాక్టర్ ఆవుల లక్ష్మయ్య కు శుభాభినందనలు...శుభాకాంక్షలు.

విషయ సేకరణ:
ఆవునూరి సమ్మయ్య. సీనియర్ జర్నలిస్ట్ హుజురాబాద్

# నియోజకవర్గం మొత్తం పురుగుల బియ్యం

### అధికారులు స్పందించి బియ్యం ను మార్చాలి

### ప్రతి పాఠశాలలో అటేండర్లను నియమించాలి

### ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రామారపు వెంకటేష్

**హుజురాబాద్ నవంబర్ 05 (ప్రజామంటలు):** శనివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హుజురాబాద్ నియోజకవర్గం లోని సింగపూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల తో భోజనం చేసి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రామారపు వెంకటేష్ మాట్లాడుతూ హుజుబాద్ నియోజకవర్గం మొత్తం పురుగు బియ్యం వచ్చాయని విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని వేంటనే అధికారులు స్పందించి పురుగు బియ్యం ను మార్చి మంచి బియ్యం వేసి విద్యార్థుల మంచి భోజనం అందించాలని కోరారు. పాఠశాలలో కొన్ని గదులు శిథిలావస్థలో ఉన్నాయని పాఠశాలకి అటెండర్ ను నియమించాలని గ్రౌండ్ లో ఉన్న గడ్డి వల్ల పాములు వచ్చే ప్రమాదం ఉందని వేంటనే అధికారులు స్పందించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మన ఊరు మన బడి పథకం ద్వారా పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి పాఠశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోడిశాల అనుదీప్, ఓజ్జా కమల్ యాదవ్ పాల్గొన్నారు.





### మధుమేహ వ్యాధి నిర్ధారణ నియంత్రణలో

# లయన్స్ క్లబ్ ల సేవలు ప్రశంసనీయం

● **లయన్స్ గవర్నర్ కన్నా**

**జనగామ నవంబర్ 5 (ప్రజామంటలు):** ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న సమస్య మధుమేహం, ఈ వ్యాధి నిర్ధారణ,



నియంత్రణ కోసం విశ్వ వ్యాప్తంగా లయన్స్ క్లబ్ లు చేస్తున్న కృషి ప్రశంసనీయం అని లయన్స్ 320ఎఫ్ జిల్లా గవర్నర్ లయన్ కన్న పరశురాములు అన్నారు. శనివారం లయన్స్ క్లబ్ జనగామ బిబాయ్స్ ఆధ్వర్యంలో స్వర్ణ కళామందిర్ రోడు గల హిందూ పార్మశి ఆవరణలో అలాగే జనగామ మిలీనియం ఆధ్వర్యంలో వీవర్స్ కాలనీ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన మధుమేహ పరీక్షా శిబిరాలను జిల్లా గవర్నర్ ప్రారంభించారు. అధ్యక్షులు బుక్క బాలభారద్వాజ్, ఏలికట్టే నరేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశాలలో ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ లు సున్నితమైన పద్దతిలో నిర్వహించే ఈ శిబిరాల్లో నిర్ధారణ వల్ల ఏ కొందరికైనా మేలు జరిగినా సంతోష దాయకం ప్రశంసనీయం అని అన్నారు. నియంత్రించ గలిగె ఈ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి కానీ బయపడ వలదని అన్నారు. ఇంకా ఈ కార్య క్రమంలో ఇరు క్లబ్ ల నాయకులు రీజియన్ చైర్మన్ దోర్నాల వేంకటేశ్వర్లు, జోన్ చైర్మన్ కే. రాజశేఖర్ రెడ్డి, ఎల్సీఐఎఫ్ కోఆర్డినేటర్ శ్రీరాం శ్రీనివాస్, ఎల్. కిషోర్, కే. బాలరాజు, డి. శివశంకర్, కన్న శ్రీనివాస్, బాలకిషన్, పి. ప్రవీణ్ శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనాల తనిఖీల్లో ముందున్న ఎల్కతుర్తి పోలీస్

**ఎల్కతుర్తి నవంబర్ 05 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి బస్టాండ్ కూడలిలో వాహనాలు తనిఖీలు చేపట్టిన ఎస్సై పరమేష్ వాహనాల తనిఖీ సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ వితౌట్ హెల్మెట్ త్రిబుల్ రైడింగ్ చేసిన వారిని పట్టుకొని కేసు చేయడం జరిగినది. ఎంతోమంది వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తూ హెల్మెట్ లేని ప్రయాణం నేరమని మీ కుటుంబానికి హానికరమని డ్రంకన్ డ్రైవ్ చేయడం వలన నీతోటి వాహనదారులకు ఇబ్బంది జరుగుతుందని మీకు ఏమైనా జరిగినా కూడా మీ కుటుంబ పెద్దలుఎంతో బాధపడతారని వాహనదారులకు సూచించడం జరిగినది. ఇందులో భాగంగా హెడ్ కానిస్టేబుల్, శంకర్, సంపత్, రవికుమార్, కుమారస్వామి, సురేందర్, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.



## జనగామ మున్సిపాలిటీ అవినీతిని అరికట్టాలి

**జనగామ నవంబర్ 05 (ప్రజామంటలు):** జనగామలో సుందరీకరణ పనులు జరగకపోవడం ఆంతర్యం ఏమిటి? ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏ గ్రేడ్ లో ఉన్నటువంటి మున్సిపాలిటీ జనగామ అభివృద్ధి కావడం లేదు.




మున్సిపల్ కార్మికుల రిక్రూట్మెంట్ లేకుండా ఎలా రిక్రూట్మెంట్ చేసుకున్నారో ప్రజలకు చెప్పాలని సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి అన్నారు. జనగామ పట్టణంలో శనివారం స్థానిక సిపిఎం జనగామ ఆఫీసులోపట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు .ఈ సమావేశానికి సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి పాల్గొని మాట్లాడుతూ జనగామ సుందరీకరణ పనులు సంవత్సరాలు గడుస్తున్న నేటి వరకు పూర్తి కాకపోవడం ఆంతర్యం ఏమిటి? కాబట్టి స్థానిక మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యే నైతిక బాధ్యత వహించి ప్రజలకు సమాధానం చెప్పాలి అని అన్నారు. సంవత్సరాలు గడుస్తున్న పూర్తి కాకపోవడం వల్ల నాణ్యత లోపాలు ఉండడం వల్ల ఆంతర్యం ఏమిటి? అని ప్రశ్నించారు. మున్సిపాల్టీలో ఇంటి నెంబర్ల ఏర్పాటు కోసం 25లక్షలు ఖర్చు చేయడం పట్ల జనగామ జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలి అని అన్నారు.జనగామ పట్టణంలో ఇంటి ఇంటికి ఇంటి నెంబర్ల ఏర్పాటు కోసం 25 లక్షల ఖర్చుకు మున్సిపల్ తీర్మానం చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమ సిపిఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ పట్టణ కార్యదర్శులకు సభ్యులు బొట్ల శ్రీనివాస్, ఎం.డి. అజారుద్దీన్, పట్టణ కమిటీ సభ్యులు పందిళ్ళ కళ్యాణి, పల్లెల లలిత, కళ్యాణం లింగం పాల్గొన్నారు.

## అసిస్టెంట్ కమిషనర్ కలిసిన భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘ నాయకులు

**జనగామ నవంబర్ 05 (ప్రజామంటలు):** భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం జనగామ జిల్లా లేబర్ ఆఫీసులో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్,ఏ.ఎల్.ఓ కుమారస్వామిని కలిశారు. కార్మిక శాఖ ఆఫీసులో



జరుగుతున్న సభ్యత్వాలు గాని, సాధారణ మరణాలు గాని యాక్సిడెంట్ డెత్ గాని క్షుణ్ణంగా పరిశీలించాలని, ఏఎల్ఓ ని అసిస్టెంట్ కమిషనర్ ని కార్మిక సంక్షేమ మండలి నిధిని దుర్వినియోగం కాకుండా పరిశీలించి అసలైన కార్మికునికి న్యాయం చేసే విధంగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తాటికొండ మధు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాస మల్ల కొమరయ్య, జనగామ జిల్లా అధ్యక్షుడు వాతల యాదగిరి, జనగామ జిల్లా ఉపాధ్యక్షులు గోనెల అనిల్ కుమార్, ఇల్లందుల బిక్షపతి, జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగిళ్ల రాజు, జిల్లా ప్రచార కార్యదర్శి బొమ్మెర యాకయ్య, టౌన్ అధ్యక్షుడు ఎలిగేటి ప్రేమ్ కుమార్, టౌన్ కార్యదర్శి బద్దేటి బాబు, టౌన్ కార్యదర్శి గోవిందు రవి, బాణాపురం నుండి మిద్దె పాక భాస్కర్, చింతకుంట్ల శ్రీను పాల్గొన్నారు.

### వెన్కేపల్లి-సైదాపూర్‌లో పరపతి సంఘం ఆధ్వర్యంలో

## వడ్ల కొనుగోలు ప్రారంభం

**సైదాపూర్ నవంబర్ 05 (ప్రజామంటలు):** హుస్నాబాద్ నియోజకవర్గం



వెన్కే పల్లి -సైదాపూర్ మండల్ వెన్కే పల్లి గ్రామ సర్పంచ్ కొండ గణేష్, విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన కరీంనగర్ జిల్లా వైస్ చైర్మన్ పేరాల గోపాల్ రావు, సహకార సంఘం అధ్యక్షులు కొత్త తిరుపతిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు వార్డ్ మెంబర్లు పలువురు పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తులను సన్మానించిన న్యాయవాదులు

**వనస్థలిపూర్ నవంబర్ 05 (ప్రజామంటలు):** తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా ఇటీవల నియమితులైన జస్టిస్ భీమపాక నగేష్, జస్టిస్ బొమ్మినేని సుధీర్ కుమార్, జస్టిస్ ఖాజా శరత్ లను న్యాయవాదులు



ఘనంగా సన్మానించారు. ఈ ముగ్గురు న్యాయమూర్తులు ఉమ్మడి ఖమ్మం జిల్లా వారు కాగా, అదే జిల్లాకు చెంది హైకోర్టులో ప్రాక్టీసు చేస్తున్న పలువురు సీనియర్ న్యాయవాదులు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలు కప్పి సత్కారం చేశారు. హైదరాబాద్ నగరంలోని వనస్థలిపురం జింకల పార్కులో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, బొమ్మెర రాంమూర్తి, గుండ్లపల్లి శేషగిరిరావు, రవి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి పద్మశాలి మండల నూతన కమిటీ

### అధ్యక్షులు గా మచ్చ సత్యం, ప్రధాన కార్యదర్శి గా గడ్డం అనిల్

**ధర్మపురి నవంబర్ 05 (ప్రజామంటలు):** మండల పద్మశాలి నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులు గా భోగ శివప్రసాద్, మ్యాన పవన్ లు వ్యవహరించగా జిల్లా కార్యవర్గ సభ్యుడు వెలుగందుల నాగభూషణం సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు



గా మచ్చ సత్యం, ప్రధాన కార్యదర్శి గా గడ్డం అనిల్, ఉపాధ్యక్షులు గా జుంజూరు అశోక్, ఆడేపు బాపన్న,భోగ రమేష్,సంయుక్త కార్యదర్శులు గా కురిక్యాల రాజేశం,బాలే మల్లయ్య, వేముల మల్లేశం,కోశాధికారి గా అయ్యోరి సత్తయ్య, లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు అయ్యోరి రాజేష్ కుమార్, జైన ఇంచార్జి సర్పంచ్ కురిక్యాల మహేష్, మార్కెట్ డైరెక్టర్ గాజుల సత్తయ్య, తుమ్మెనాల ఎంపీటీసీ ఆకుబత్తిని తిరుపతి, ఆలయ డైరెక్టర్ వేముల నరేష్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు నక్క రాజేందర్,కొంక వరప్రసాద్, నాయకులు, వేముల రాజన్న, కటకం రాజన్న, వేముల మల్లేశ్, అన్నందాసు శ్రీనివాస్, సామల్ల చంద్రయ్య, అల్లే మురళి, మచ్చ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



## ఆకాశ్ పూరికి కలసిరాని టైమ్

### చోర్‌బజార్ ఫెయిల్యూర్‌తో నిరాశ

పూరి జగన్నాథ్ వారసుడిగా తెరంగేట్రం చేసిన ఆకాష్ కి ఇంకా సరైన సక్సెస్ పడలేదు. శక్తివంచన లేకుండా శ్రమిస్తున్నా ఫలించడం లేదు. ఇటీవలే 'చోర్ బజార్' తో ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ సినిమా కూడా ఆకాష్ అంచనాలు అందుకో లేకపోయింది. అంతకు ముందు రెండు సినిమాలు సోసోగానే రాణించాయి. కానీ ఆ సౌండింగ్ ఇప్పుడున్న పోటీలో సరిపోదు. బ్లాక్ బస్టర్ కొట్టి రేసులో ఉంటే తప్ప లెక్కలోకి రాని పరిస్థితి. మరి ఆకాష్ తాజా పరిస్థితి మాత్రం పూర్తి ప్రతికూలంగానే కనిపిస్తుంది. 'చోర్ బజార్' వైఫల్యంతో మరింత బ్యాడ్ ఫేజ్ లోకి జారుకున్నాడు. అటు పూరి పరిస్థితి సరిగ్గా లేదు. ఇటీవల ఆయన తెరకెక్కించిన 'లైగర్' రిలీజ్ అయి ఎలాంటి పరిస్థితులు ఎదుర్కుంటుందో? తెలిసిందే. పూరి ఇప్పుడున్న స్థితిలో తనయుడితో సొంతంగా సినిమా నిర్మించలేడు. బయ్యర్లుకి చేసిన ప్రామిస్ ని ముందుగా నిలబెట్టుకోవాలి. ఆ తర్వాత కొత్త సినిమా ఆలోచన చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం వాటి తాలుకా సెటిల్మెంట్ లో బిజీగా ఉన్నారు. మరి ఆకాష్ పరిస్థితి ఏంటి? అంటే లాంగ్ గ్యాప్ తప్పదనే ఫిలిం సర్కిల్స్ లో చర్చకొస్తుంది. ప్రతిభావంతుడే అయినా ఇంకా మార్కెట్ ని బిల్డ్ చేసుకోలేదు. నటుడిగా ఇప్పుడిప్పుసడే ఎదుగుతున్నాడు. తనిన నమ్మి కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టడని ఆకాష్ నే స్వయంగా తన స్టామినా గురించి ఓ సందర్భంలో రివీల్ చేసాడు. నటుడిగా ఎదిగే ప్రాసస్ లో నే ఉన్నానని...సరైన సక్సెస్ పడిన తర్వాత నాన్నతో నేనే సినిమా చేస్తానని గర్వంగా ప్రకటించాడు. అంతవరకూ ఆకాష్ వెయిట్ చేయాల్సిందే. బయట బ్యానర్లలో అవకాశాల కోసం సీరియస్ ప్రయత్నాలు చేయాలి. ఆడిషన్ లో సెలక్ట్ కావాలి. ఆ తర్వాతే ఛాన్స్. ఇవన్నీ ఆకాష్ కి కొత్తేం కాదు. తండ్రి బాటలోనే తనయుడి ప్రయాణం సాగిస్తున్నాడు. కష్టాన్ని నమ్ముకుని ముందుకెళ్తున్నాడు. నెపోటిజం ని అడ్వాంటేజ్ గా తీసు కుని అవకాశాలు అందుకోవడం లేదు. ఇండస్ట్రీలో సక్సెస్ ..నేమ్ అన్ని నాన్న కారణంగా కాకుండా..స్వయంగానే సంపాదించాలని కమిట్ మెంట్ ఉన్న కుర్రాడు. ఆ రకమైన కష్టాన్ని మాత్రమే నమ్ముకుని ముందుకు సాగుతున్నాడు. తన మాటల ద్వారానే తన లో మెచ్యూరిటీ బయట పడుతుంది. మరి ఇవన్నీ దాటుకుని కొత్త ఛాన్స్ అందుకుంటాడా? లేక లాంగ్ బ్రేక్ తీసుకుంటాడా? అన్నది చూడాలి.

## విడుదలకు సిద్ధంగా వారసుడు

ఈ ఏడాది 'బీస్ట్'తో భారీ పరాజయం సాధించిన విజయ్.. 'వారసుడు' సినిమాతో ఎలాగైనా మంచి కంబ్యాక్ ఇవ్వాలని చూస్తున్నాడు. వంశీ పైడిపల్లి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులలో బిజీగా ఉంది. ఇప్పటికే చిత్రం నుండి రిలీజైన పోస్టర్‌లు సినిమాపై మంచి అంచనాలు నెలకొల్పాయి. కాగా విజయ్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న వారసుడు ఫస్ట్ సింగిల్ శనివారం సాయంత్రం రిలీజ్ కానుంది. ఈ క్రమంలో తాజాగా చిత్రబృందం పాటకు సంబంధించిన స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేసింది. విజయ్, రష్మిక రొమాంటిక్ లుక్‌తో ఈ పోస్టర్‌ను చిత్రబృందం డిజైన్ చేశారు. 'రంజితమే' అంటూ సాగే ఈ పాట గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. థమన్ సంగీతం అందించిన ఈ పాటను ఎమ్.ఎమ్ మానసితో కలిసి విజయ్ ఆలపించాడు. యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, పీవీపీ పతాకాలపై దిల్ రాజు, శిరీష్, పరమ్ వి పొట్లూరి, పెరల్ వి పొట్లూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**జనగామ నవంబర్ 05 (ప్రజామంటలు):** వరి ధాన్యాన్ని రైతులు మధ్య దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని తెలంగాణ రాష్ట్రం పట్ల బిజెపి సర్దార్ కుట్ర చేస్తుందని మాజీ డిప్యూటీ



సీఎం స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. శనివారం రఘునాథ్ పల్లి మండలం గోవర్ధనగిరి,ఖిలాషాపురం, ఇబ్రహీంపురం, లక్ష్మీ తండా, మాదారం గ్రామాల్లో పర్యటించి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు అని సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ప్రతి రైతు సంఘం చేసుకోవాలని కోరారు. ప్రతి గింజ చివరి వరకు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తుందని కొంత అలస్యమైన రైతులు భయపడవద్దని తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల వరలక్ష్మి నరేందర్, తెరాసా మండల అధ్యక్షులు వారాల రమేష్ యాదవ్, కార్యదర్శి ముసి పట్లవిజయ్, జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పోకలశివకుమార్ గుప్తా, ఎంపిడివో అసీం, తాసిల్దార్ అన్వర్, తెరాస మండల నాయకులు శివరాత్రి రాజ్, సురేష్ మార్కెట్ డైరెక్టర్లు నూనె ముంతల యాక స్వామి గౌడ్, కె. శంకర్, సర్పంచులు సుంకరి అనిత శ్రీనివాస్, శ్రీధర్ గౌడ్, ఎంపీటీసీ లు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'స్వచ్ఛత' దినచర్యలో భాగం కావాలి

**హన్మకొండ జిల్లా 05 (ప్రజామంటలు):** కాకతీయ విశ్వవిద్యలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ సెమినార్ హాల్ లో ఎల్.బి కళాశాల జాతీయ సేవా పథకం వారం రోజుల ప్రత్యేక శీతాకాల శిబిరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ అధ్యక్షతన విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంధాలయం లో కీర్తిశేషులు మాడ దేవేందర్ రెడ్డి స్మృత్యర్థం వారి కుటుంబ సభ్యులు రూపాయలు 50 వేల తో ఏర్పాటు చేసిన మంచి నీటి ట్యాంక్ ను ప్రారంభించారు. సమాజానికి సేవ చేయటానికి,



నిర్వహిస్తున్న కార్యక్రమంలో ముఖ్య అతిదిగా పాల్గొని వాలంటీర్ లను ఉద్దేశించి ప్రసంగించార. ప్రతి ఒక్కరూ స్వచ్ఛ సైనికులు గా పని చేయాలి అన్నారు, క్రమశిక్షణ తో షెడ్యూల్ ప్రకారం టార్గెట్ పూర్తీ చేయాలి అన్నారు, కాకతీయ విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకానికి జాతీయ స్థాయి గుర్తింపు రావటం లో మీ రక్తదాన శిబిరాలు, క్లీన్ అండ్ గ్రీన్, ప్లాస్టిక్ ఏరివేత, కోవిడ్ సమయంలో చేసిన సేవలు ముఖ్య భూమిక వహించాయి అన్నారు. విశ్వవిద్యాలయానికి సేవ చేయటానికి పూర్వ విద్యార్థులు ముందుకు రావాలి అని విద్యార్థులను కోరారు. గతంలో సేవా కార్యక్రమాలను నిర్వహించిన వాసవి క్లబ్ వరంగల్ వారిని గుర్తు చేసారు. ఈ కార్యక్రమం లో గ్రంధాలయ మెంబెర్ ఇంచార్జ్ డా. రాధిక రాణి, లైబ్రరియన్ డా. సుజాత, లైబ్రేరియన్ తేజావత్ జావేర్ తో పాటు హరిత దేవేందర్ రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### విశాల పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో

## వడ్లు కొనుగోలు ప్రారంభం

**సైదాపూర్ నవంబర్ 05 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం సైదాపూర్ మండలంలోని బొమ్మకల్ గ్రామంలో విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన కరీంనగర్ జిల్లా వైస్ చైర్మన్ పేరాల మిల్లర్లతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ రుద్రారం రవితేజ కోరారు. పై విషయంపై అధ్యక్షులు స్పందిస్తూ అదనంగా ఎలాంటి వడ్లు తీసుకోబడవని వడ్ల కొనుగోలు కేంద్రంలో అన్ని రకాల సౌకర్యాలు



గోపాల్ రావు, సంఘం అధ్యక్షులు కొత్త తిరుపతి రెడ్డి ప్రారంభించారు. అధ్యక్షులు కొత్త తిరుపతి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో లారీల కొరత, ఉండరాదని,40 కిలోలకు ఒక సంచి కిలో చొప్పున తాలు పేరు చెప్పి అదనంగా మరొక కిలో, ఒక సంచి పేరున రెండు కిలోలు అనే మాట ఉండరాదని చేస్తామని చెప్పారు. ఇట్టి వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవాన్ని విశాల సహకార సంఘం డైరెక్టర్లు ఏలూరి నర్సిరెడ్డి, ఏలూరు తిరుపతి రెడ్డి, ఓలాద్రి మహేందర్ రెడ్డి మాజీ సర్పంచ్ చిట్టి ప్రకాష్ రెడ్డి, పెర్కపల్లి సర్పంచ్ కొమురయ్య, ఓజ్జా కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## దళితుల ఆర్థిక అభివృద్ధికి చేయూత దళిత బంధు

### జమ్మికుంట జడ్పీటీసీ శ్రీరామ్ శ్యామ్

**జమ్మికుంట నవంబర్ 05 (ప్రజామంటలు):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ని ఇందిరానగర్ లో మడిపల్లి గ్రామానికి చెందిన సారభద్రం దళిత బంధు పథకం ద్వారా వచ్చిన టైల్స్ షాప్ ని శనివారం జమ్మికుంట జడ్పిటిసి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా జడ్పిటిసి శ్రీరామ్ శ్యామ్ మాట్లాడుతూ.... భారతదేశంలో ఏ రాష్ట్రంలో ప్రవేశపెట్టని పథకాన్ని, దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు దళితుల ఆర్థిక అభివృద్ధికి చేయూత ఇస్తున్నాడని దీన్ని ఉపయోగించుకొని దళిత కుటుంబాలలో ఆర్థికంగా ఎదగాలని వారు కోరారు. దళిత బంధు పథకం ఇప్పటికే దాదాపు 90% పూర్తయిందని వారు గుర్తు చేశారు. మిగతా రాని వారి కూడా త్వరలో ఈ పథకం చేకూరుతుందని వారు వివరించారు. దళిత బంధు ద్వారా ఎంతోమంది దళిత కుటుంబాలు సంతోషంగా ఉన్నాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి సర్పంచ్ మూగల పరుశరాములు, జమ్మికుంట పిఏసిఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మైస మహేందర్, కుమార్, శ్యామ్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## నచ్చింది గర్ల్ ఫ్రెండూ..ట్రైలర్ విడుదల

యువ హీరో ఉదయ్ శంకర్ నటిస్తున్న కొత్త సినిమా 'నచ్చింది గర్ల్ ఫ్రెండూ'. జెన్నీ హీరోయిన్ గా నటిస్తోంది. మధునందన్ మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. కమర్షియల్ థ్రిల్లర్ గా రూపొందుతున్న ఈ మూవీని దర్శకుడు గురు పవన్ తెరకెక్కిస్తున్నారు. శ్రీరామ్ ఆర్ట్స్ బ్యానర్ పై అట్లూరి ఆర్ సౌజన్య సమర్పణలో.. అట్లూరి నారాయణ రావు నిర్మిస్తున్నారు. ఈ నెల 11న రిలీజ్ అవుతున్న ఈ మూవీ ట్రైలర్ ని విక్టరీ వెంకటేష్ శనివారం లాంఛ్ చేశారు.ఈ సందర్భంగా విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ: 'ట్రైలర్ చాలా బాగుంది. కాన్సెప్ట్ కూడా చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంది. విజువల్స్ బాగున్నాయి. ఈసినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ తో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయని తెలిసింది. ఉదయ్ శంకర్ కి మంచి విజయం దక్కుతుందని ఆశిస్తున్నాను. టీం కి నా బెస్ట్ విషెష్ ' అన్నారు. హీరో ఉదయ్ శంకర్ మాట్లాడుతూ: 'విక్టరీ వెంకటేష్ గారు మా ట్రైలర్ ని లాంఛ్ చేయడం చాలా సంతోషంగా ఉంది. ఒక రోజు జరిగే కథ లో అన్ని ఎమోషన్స్ ఉన్నాయి. దోస్తీ సాంగ్.. ఎర్రతోలు పిల్ల సాంగ్స్ కి బాగా రెస్పాన్స్ వస్తుంది. ఈ సినిమా యూత్ కి బాగా కనెక్ట్ అవుతుంది. వెంకటేష్ గారు ట్రైలర్ ని చూసి మా టీం ని అభినందించడం మాకు కొత్త ఎనర్జీని ఇచ్చింది' . హీరోయిన్ జెన్నీఫర్ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ: 'వెంకటేష్ గారు మా ట్రైలర్ ని లాంఛ్ చేసినందుకు చాలా థ్యాంక్స్ . మా సినిమా తప్పకుండా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. ఒన్ డే లో జరిగే ఈ లవ్ స్టోరీ లో చాలా ఎమోషన్స్ ఉన్నాయి'. అన్నారు. నిర్మాత అట్లూరి నారాయణ మాట్లాడుతూ: 'రామానాయుడు స్టూడియోస్ లో విక్టరీ వెంకటేష్ గారి చేతులు మీదుగా నచ్చింది గాళ్ ఫ్రెండూ ట్రైలర్ లాంఛ్ చేయడం చాలా సంతోషంగా ఉంది. విక్టరీ వెంకటేష్ గారు మా ట్రైలర్ చూసి ఇచ్చిన ఫీడ్ బ్యాక్ మాకు చాలా ఉత్సాహాన్ని ఇచ్చింది. యూత్ ఫుల్ కంటెంట్ గా రూపొందిన ఈ సినిమా ఈ నెల 11న రిలీజ్ కి సిద్ధం అవుతుంది. తప్పకుండా ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్ముతున్నాను' అన్నారు.

## నాలుగు సినిమాలను నిర్మిస్తున్న లైకా ప్రొడక్షన్

తాజాగా లైకా సంస్థ మరో సినిమాను సెట్స్‌పైకి తీసుకొచ్చింది. సూపర్ స్టార్ రజనీకాంత్ పెద్ద కూతురు ఐశ్వర్యతో లాల్ సలామ్ అనే సినిమా చేస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. ఈ చిత్రంలో విష్ణు విశాల్, విక్రాంత్




ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా చిత్రబృందం టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. ఈ పోస్టర్‌లో మంటల్లో కాలిపోతున్న క్రికెట్ హెల్మెట్‌ని చూపించారు. అంతేకాకుండా హెల్మెట్ పక్కన బాల్, వికెట్ బెల్స్ పడిఉండటం పోస్టర్‌లో కనిపిస్తుంది. స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కనున్నట్లు పోస్టర్ చూస్తే తెలుస్తుంది. పోస్టర్‌తోనే చిత్రబృందం సినిమాపై విపరీతమైన క్యూరియాసిటీ క్రియేట్ చేస్తుంది. ఈ చిత్రంలో సూపర్ స్టార్ రజనీకాంత్ గెస్ట్ రోల్ చేస్తున్నాడు. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు. ఐశ్వర్య '3' మూవీతో దర్శకురాలిగా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'వాయ్ రాజా వాయ్', 'సినిమా వీరన్' వంటి సినిమాలను తెరకెక్కించింది. ఇటీవలే ఈమె ధనుష్‌తో విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. విడాకుల తర్వాత ఐశ్వర్య పలు ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉంది. ప్రస్తుతం ఈమె 'ఓ సాతి చల్' అనే హిందీ సినిమా చేస్తుంది. ఈ సినిమా సెట్స్‌పైన ఉండగానే లైకాతో చేయబోయే సినిమాను పట్టాలెక్కించింది.

## ప్రీప్రొడక్షన్ పనుల్లో నాగశౌర్య సినిమా

ఇదిలా ఉంటే నాగశౌర్య ఇటీవలే తన నెక్స్ట్ సినిమాను ప్రకటించిన విషయం తెలిసిందే. 'ఎన్‌సి24'గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి అరుణాచలం దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటుంది. కాగా తాజాగా చిత్రయూనిట్ ఈ సినిమాకు సంబంధించిన బిగ్ అప్‌డేట్‌ను ప్రకటించింది. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ వెట్రీ పలనిస్వామి ఛాయగ్రాహకుడిగా పనిచేయనున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఫ్యామిలీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని వైష్ణవి ఫిలింస్ బ్యానర్‌పై శ్రీనివాస్ రావు, విజయ్ కుమార్, అరుణ్‌కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నాగశౌర్య గత చిత్రాలకంటే భిన్నంగా కనిపిస్తాడని చిత్రబృందం ఇటీవలే వెల్లడించింది. కాగా ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల గురించి త్వరలోనే ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ సినిమా పూజా కార్యక్రమాలు ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా జరుగనున్నాయి.

## గాలోడు ట్రైలర్ విడుదల

బుల్లితెరపై కమెడియన్‌గా, హోస్ట్‌గా అలరిస్తున్న సుడిగాలి సుధీర్, హీరోగానూ బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నాడు. వాటిలో 'గాలోడు' చిత్రం ఒకటి. రాజశేఖర్ రెడ్డి పులిచర్ల దర్శకుడు. గెహాన సిప్పి హీరోయిన్‌గా నటిస్తోంది. నిన్న ఈ మూవీ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో సుధీర్ మాస్ లుక్‌లో మెస్మరైజ్ చేస్తున్నాడు. 'మా ఊళ్లో నన్ను కుర్రాడు అనరు. కొవ్వోడు అంటారు' అంటూ తన క్యారెక్టర్‌ని పరిచయం చేశాడు. అలాగే 'వాడిది మాములు రేంజ్ కాదు మాఫియా రేంజ్, సైనైడ్, యాసిడ్ కంటే డేంజర్‌రా వాడు. రాక్షసుల గురించి పుస్తకాల్లో చదివాను, విన్నాను మొట్టమొదటి సారి వీడిలో చూశాను సార్' అనే డైలాగ్స్‌తో సుధీర్



పాత్రపై క్యూరియాసిటీ పెంచారు. తను చేసిన యాక్షన్ ఎపిసోడ్స్‌తో పాటు డ్యాన్స్ మూమెంట్స్ హైలైట్‌గా ఉన్నాయి. గెహాన, సప్తగిరి, షకలక శంకర్ కామెడీ ట్రాక్ కూడా బాగుంది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com